సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 24.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 294
పేజీలు: 08 వెల: రూ. 5

## నర్సింగ్ విద్యార్థినుల భద్రతపై సీరియస్

02 విద్యార్థినుల గొడవపై సీఎం చంద్రబాబు ఆరా

- కాకినాడ నర్సింగ్ కాలేజీలో ఘర్షణ
- కాకినాడ ఘటనపై రంగంలోకి కలెక్టర్, ఎస్పీ
- విద్యార్థినుల సమస్యకు అధికారుల పరిష్కారం



## బిల్లుల కోసం కేంద్రం వ్యూహం

02

- ప్రొరోగేషన్‌పై ఎందుకింత ఆలస్యం?
- కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమేమి?
- డీలిమిటేషన్‌పై కొత్త ఫార్ములా?
- మహిళా రిజర్వేషన్‌పై మళ్లీ కసరత్తు?



## ఐక్య పోరాటాలతోనే జర్నలిస్టులకు రక్షణ

08

భయంతో వచ్చే స్వీయ సెన్సార్ ప్రభుత్వ సెన్సార్ కంటే ప్రమాదకరం

- జర్నలిస్టుల హక్కులకు బలమైన రక్షణ వ్యవస్థ ఏది?
- జర్నలిస్టులను విడదీస్తున్న కాంట్రాక్ట్ విధానం
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి




## హైదరాబాద్ వచ్చాక మాట్లాడతా

అమెరికా పర్యటన రద్దుపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

- కేంద్రం రాజకీయ కక్ష సాధింపే
- లండన్ పర్యటన సక్సెస్.. కీలక భాగస్వామ్యాలు



02

## మల్లారెడ్డి కాలేజీపై కేసు

టాక్సిక్ ప్రీరిలీజ్ ఈవెంట్లో తొక్కిసలాట



- హీరో యశ్‌ను చూసేందుకు దూసుకొచ్చిన విద్యార్థులు
- ఒత్తిడికి కూలిన ఫ్లడ్ లైట్ స్తంభం, స్పీకర్ బాక్సులు
- పలువురు విద్యార్థులకు గాయాలు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

02

## మహిళను చంపి.. బిర్యానీ వండి



- ముక్కలు ముక్కలుగా చేసిన దంపతులు
- సూట్ కేసులో మరికొన్ని శరీర భాగాలు
- చెన్నైలో వెలుగులోకి సంచలన ఘటన

03

# పదవులకు వేళాయే

## తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల జాతర

### సెప్టెంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- కార్యకర్తలకే పెద్దపీట
- 80 శాతం పాత నేతలకే
- 20 శాతం కొత్త నేతలకు..
- కష్టపడిన వారికి ప్రాధాన్యం
- పదవుల భర్తీపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన
- 100 సీట్లపై ధీమా
- మళ్లీ అధికారమే లక్ష్యం



**ముద్ర డెస్క్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. వచ్చే సెప్టెంబర్‌లోనే రాష్ట్రంలోని నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నిబద్ధత కలిగిన కార్యకర్తలకే ఈ పదవుల్లో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**పాత కార్యకర్తలకు 80 శాతం.. కొత్త నేతలకు 20 శాతం**
నామినేటెడ్ పదవుల భర్తీలో 80–20 నిష్పత్తిని అనుసరించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. మొత్తం పదవుల్లో 80 శాతం పార్టీకి గతంలో అండగా నిలిచి, కష్ట కాలంలో పనిచేసిన పాత కార్యకర్తలకు కేటాయిస్తామని చెప్పారు. మిగిలిన 20 శాతం పదవులను పార్టీ బలోపేతానికి అవసరమైన కొత్త నేతలకు అవకాశం కల్పించేలా భర్తీ చేస్తామని వివరించారు. గతంలో పదవుల కేటాయింపులో కొన్ని చిన్నపాటి పొరపాట్లు జరిగాయని అంగీకరించిన మిగతా 02లో



## కొండాపై వేటు ఖాయం?

### రాజీనామానా.. బర్తరఫ్ చేయడమా?

- సుష్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలగకుండా కఠిన చర్యలకు సంకేతాలు
- రేవంత్ లండన్ పర్యటన ముగియగానే వెలువడనున్న కీలక నిర్ణయం
- బీసీ సమీకరణాల నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి?

**ముద్ర, హైదరాబాద్ :**
రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పదవీ గండం ఎదుర్కొంటున్నారా? ఆమెను కేబినెట్ నుంచి తప్పించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయా? అంటే అవుననే అంటున్నాయి రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు. కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం అత్యంత తీవ్రంగా పరిగణించింది. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేకూర్చేలా వ్యవహరించే విషయంలో ఎంతటి వారైనా సరే రాజీపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పెద్దలు స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే దిశగా తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**స్వయానా సీఎంను లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహం**
వరంగల్ వేదికగా సుష్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం అధిష్ఠానాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై వివరణ కోరుతూ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఆ వ్యాఖ్యలు మిగతా 02లో

## చర్చలు సఫలం సమ్మె విరమణ

ఆటో కార్మిక సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్

- డిమాండ్లపై సర్కార్ సానుకూలత
- ఆటో చార్జీల పెంపునకు గ్రీన్ సిగ్నల్.. త్వరలో కొత్త జీవో
- ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు.. సెప్టెంబర్ 1న కీలక భేటీ
- ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ యాప్.. ఆటోలకు కొత్త ఊతం

**ముద్ర, హైదరాబాద్:**
ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించడంతో నిరవధిక బంద్‌ను విరమించుకున్న ఆటో కార్మిక సంఘాలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆర్టీసీ పక్షాన ఈవీ ఆటోలు కొనుగోలు చేయనున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి తెలిపారు. ఇది



కేవలం దుష్ప్రచారం మాత్రమేనని స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. బోర్డు విధివిధానాలపై సెప్టెంబర్ 1న కార్మిక శాఖ, రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2012 తర్వాత ఆటో చార్జీలు పెరగలేదని గుర్తించిన ప్రభుత్వం.. చార్జీల పెంపునకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఎంత మేర పెంచాలన్న దానిపై తగిన నివేదిక తీసుకుని, అనంతరం సంబంధిత జీవో జారీ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వం తరఫున ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. యాప్ ప్రారంభానికి ఐటీ మిగతా 02లో

## అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తుంది

స్ఫూర్తిగా నిలుస్తున్న ఇస్రో విజయాలు

02

- ఈ రంగం పెట్టుబడిదారులకు అయస్కాంతం
- వికసిత్ భారత్లో అంతరిక్ష రంగం కీలకం
- జెన్-జీ యువత సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణలు
- స్పేస్ స్టార్టప్ సీఈవోలతో ప్రధాని మోదీ



ఇదీ AI ముద్ర



## సోయాతో గుండె ఆరోగ్యానికి మేలు



సోయాలోని ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు గుండె ఆరోగ్యానికి సహాయపడవచ్చు. సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది.



# గ్రాడ్యుయేట్స్ బరిలో గడల

**ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో గడల శ్రీనివాసరావు**
**జనసేన ముందస్తు ప్రకటన..**
**అభ్యర్థిత్వానికి పవన్ కళ్యాణ్ సుముఖత**
**పట్టభద్రులు, ఉద్యోగులు, యువత సమస్యల గొంతుకగా పనిచేస్తానన్న డాక్టర్ గడల**

**ముద్ర ఖమ్మం:**
ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ ముందస్తుగా ప్రకటించింది. పార్టీ రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న గడల శ్రీనివాసరావును ఎమ్మెల్సీ బరిలో నిలపాలని పార్టీ నిర్ణయించింది. గతంలో వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలంగాణ వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందించారు. పరిపాలనతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉందని జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి.

**పవన్ కళ్యాణ్‌కు ప్రతిపాదన**
డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును జనసేన జాతీయ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు పవన్ కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన పేరును ముందస్తుగా ప్రకటించినట్లు పార్టీ తెలిపింది.

**పట్టభద్రుల సమస్యలే ప్రధాన అజెండా**
పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలి వేదికగా బలంగా వినిపిస్తానని డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. సమస్యలను కేవలం ప్రస్తావించడమే కాకుండా, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి మూడు జిల్లాలకు చెందిన పట్టభద్రులు, మేధావులు,



ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు తనకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**మూడు జిల్లాల్లో జనసేనకు పరీక్ష**
పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుని తెలంగాణలో జనసేన పార్టీ సత్తా చాటుతామని డాక్టర్ గడల శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. తనను అభ్యర్థిగా ప్రకటించినందుకు పవన్ కళ్యాణ్, జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిల్లుల కోసం కేంద్రం వ్యూహం

**ముద్ర, న్యూఢిల్లీ:**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసి పది రోజులు దాటినా.. కేంద్రం ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ చేయకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. లోక్‌సభ, రాజ్యసభలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, రాష్ట్రపతి నుంచి ప్రొరోగేషన్ ఉత్తర్వులు వెలువడలేదు. సాధారణంగా సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ జరుగుతుంది. దీంతో కేంద్రం ఏదైనా కీలక నిర్ణయానికి సిద్ధమవుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



**మహిళా రిజర్వేషన్‌పై కొత్త బిల్లు?**
ప్రొరోగేషన్ ఆలస్యానికి అధికారిక కారణం వెల్లడికాకపోయినా.. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై కేంద్రం కసరత్తు చేస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2029 ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందనే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేయాల్సి ఉంది.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**
జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన ఉంది. దీనికి పరిష్కారంగా మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఫార్ములాపై కేంద్రం ఆలోచిస్తోందనే చర్చ సాగుతోంది.

**ప్రత్యేక సమావేశం ఉంటుందా?**
స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ప్రొరోగేషన్ ఆలస్యంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నలు సంధించారు. డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లును ఆమోదించేందుకు కేంద్రం మూడింట రెండొంతుల మెజార్టీ సమీకరణపై దృష్టి పెట్టిందా? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్ దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలని కోరగా, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రొరోగేషన్‌పై ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌పై కొత్త ఫార్ములా తీసుకొస్తుందా? ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## నర్సింగ్ విద్యార్థినుల
# భద్రతపై సీరియస్

**ముద్ర, అమరావతి :**
కాకినాడలోని ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ రంగంలోకి దిగి విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టారు. విద్యార్థినుల వసతి గృహాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన వసతి కల్పించడంతో పాటు.. పరిస్థితి మరింత ఉద్రిక్తం కాకుండా చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారమైంది. అధికారులు స్పందించిన తీరుపై ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఏం జరిగిందంటే?**
ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థినుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తన ఫోన్ పోయిందంటూ మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం తలెత్తింది. ఫోన్ దొరికినప్పటికీ గొడవ సద్దుమణగకపోవడంతో ఏపీ, మణిపూర్ విద్యార్థినులు పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.





# చర్చలు సఫలం.. సమ్మె విరమణ

(మొదటి పేజీ తరువాయి)
శాఖ ద్వారా అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. రాపిడో, ఓలా, ఉబెర్ తరహా ద్విచక్ర వాహనాల ద్వారా ప్రయాణికుల రవాణాపై కూడా ఎల్లో ప్లేట్ ఉన్న వాహనాలకే అనుమతి కల్పించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, సహచర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలోని పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందించనుందని మంత్రి వెల్లడించారు. కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈవీ ఆటోలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం పూర్తిగా సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ చర్చల్లో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ పాల్గొన్నారు.

## అంతరిక్ష రంగంలో భారత్
# దూసుకెళ్తోంది

**ముద్ర, ఢిల్లీ :**
జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగం (Space Sector) లో భారత్ ప్రపంచవ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక 'ఆయస్కాంతం' లా మారిందని ఆయన అభివర్ణించారు. స్పేస్ సెక్టార్‌లోని స్టార్టప్‌ల సీఈవోల తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జెన్–జీ యువత సరికొత్త టెక్నాలజీని నిర్మిస్తోందని ప్రశంసించారు. అదే విధంగా తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను ఆయన పంచుకున్నారు.
"అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. దేశ యువతను కొనియాడుతూ.. ఈ రోజు మన జెన్–జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారని అన్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోంది" అని అన్నారు. ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు.
2023లో ఇదే రోజున చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ ఏడాది "వికసిత భారత్ దిశగా : ఆవిష్కరణ, సహకారం, ప్రపంచ అంతరిక్ష నాయకత్వం" అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ మాట్లాడుతూ.. దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు ఎంతో అవసరమని పిలుపునిచ్చారు.




(మొదటి పేజీ తరువాయి)
కుమార్తె వ్యక్తిగతమని, తనను బాధ్యురాలిని చేయవద్దని సురేఖ బదులిచ్చారు. అయితే, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించకపోవడంపై స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా సీఎల్పీ వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, ఆమెను కేబినెట్ నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

**ముందున్న రెండు మార్గాలు**
సురేఖ స్థానాన్ని భర్తీ చేసే క్రమంలో అధిష్ఠానం ముందు ప్రస్తుతం రెండు మార్గాలున్నట్లు తెలుస్తోంది. ఆమె చేత స్వచ్ఛందంగా రాజీనామా చేయించాలా లేక నేరుగా బర్తరఫ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలా అనే అంశంపై ముఖ్యనేతలలో తీవ్ర చర్చ సాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని తిరిగి రాగానే ఈ వ్యవహారంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# కొండాపై వేటు ఖాయం?

**వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఛాన్స్?**
కొండా సురేఖను తప్పిస్తే బీసీ సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా ఉండేలా హైకమాండ్ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మున్నూరు కాపు వర్గానికి చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే దిశగా కసరత్తు జరుగుతోంది. రేవంత్ హైదరాబాద్‌కి రాగానే ఆది శ్రీనివాస్ చేత నూతన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏఐసీసీ (AICC) నుంచి రాష్ట్ర పార్టీ కీలక నేతలకు ఇప్పటికే ఈ మేరకు స్పష్టమైన సంకేతాలు, ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది.



# పదవులకు వేళాయే

(మొదటి పేజీ తరువాయి)
ఆయన.. ఈ సారి అలాంటి తప్పిదాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్రమశిక్షణ, పార్టీ పట్ల నిబద్ధత, కష్టపడే తత్వం ప్రధాన ప్రాతిపదికగా పదవుల ఎంపిక ఉంటుందన్నారు.

**మళ్లీ అధికారమే లక్ష్యం**
కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడానికి కార్యకర్తల త్యాగాలు, నిరంతర శ్రమే ప్రధాన కారణమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో 100కు పైగా స్థానాలు గెలుచుకుని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి కాలేజీపై కేసు

**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శనివారం రాత్రి నిర్వహించిన కన్నడ స్టార్ హీరో యశ్ 'టాక్సిక్' సినిమా ప్రీ–రిలీజ్ ఈవెంట్లో తీవ్ర అపశృతి చోటుచేసుకుంది. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో యూనివర్సిటీ యాజమాన్యం, ఈవెంట్ మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున అభిమానులు, విద్యార్థులు హాజరయ్యారు. వేదిక సమీపంలో క్రౌడ్ విపరీతంగా పెరగడంతో కొంత మంది యువకులు క్లియర్ వ్యూ కోసం ఫ్లడ్ లైట్ స్తంభాలు, భారీ సౌండ్ బాక్సులకు అమర్చిన ఐరన్ పోల్స్ పైకి ఎక్కారు. బరువు ఎక్కువై భారీ సౌండ్ బాక్స్ అమర్చిన ఒక పోల్ ఉన్నపళంగా కిందపడిపోయింది.

**ప్రసంగాన్ని ఆపేసిన యశ్..**
ఈ ప్రమాదం జరిగే సమయంలో హీరో యశ్ వేదికపై మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పోల్ పడిపోవడాన్ని గమనించిన ఆయన వెంటనే ప్రసంగాన్ని ఆపేసి కంగారుగా స్పందించారు. 'అక్కడ అందరూ సురక్షితంగానే ఉన్నారా? ఏమైందో చూడండి' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా లైటింగ్ స్టాండ్లు, మైక్ పోల్స్ ఎక్కిన యువకులను వెంటనే కిందకు దిగాలని వేదికపై నుంచే కోరారు. ఈ దుర్ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులను పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వేలాది మంది వచ్చే ఈవెంట్లో భద్రత, గుంపు నియంత్రణ నిబంధనలు పాటించనందుకే ఈ ప్రమాదం జరిగిందని భావించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్‌కు వచ్చాక అన్నీ మాట్లాడతా..

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం వల్లనే తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. యూకే, యూఎస్ పర్యటనలకు ప్రభుత్వం ముందుగానే అనుమతులు కోరినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కేవలం లండన్ పర్యటనకే క్లియరెన్స్ ఇచ్చి, అమెరికా పర్యటనకు 'రాజకీయ కోణం' చూపిస్తూ అనుమతి నిరాకరించిందని సీఎం తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గళమెత్తి సీఎం రేవంతు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఖర్గేకు రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**లండన్ పర్యటన సక్సెస్..**
తన లండన్ పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాలు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో తెలంగాణకు కీలకమైన భాగస్వామ్యాలు కుదిరాయని పేర్కొన్నారు. మరికొద్ది గంటల్లోనే తాను హైదరాబాద్‌కు చేరుకుంటానని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత కేంద్రం వైఖరి, పూర్తి అంశాలపై మాట్లాడతానని వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 24.08.2026



## వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# మనసుకు హత్తుకునే 10 మాటలు

**01** ఒకరిని బాధపెట్టి మనం సంతోషంగా ఉండవచ్చు, కానీ మన వల్ల వారు పడిన బాధను ఎప్పుడూ మరచిపోవద్దు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, మనం చేసిన పనికి ఏదో ఒక రోజు ఫలి తం ఎదురవుతుంది.

**02** అతి స్నేహం, అతి ప్రేమ, అతి చనువు మంచిది కాదు. అతిగా అనుబంధం పెంచుకుంటే బాధ కూడా అంతే ఎక్కు వగా ఉంటుంది. ప్రతి బంధంలో కొంత హద్దు ఉంటేనే మన శ్యాంతి ఉంటుంది.




**03** విశ్వాసం అనే మాటను చెప్పడానికి ఒక క్షణం చాలు. దాన్ని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. కానీ దాన్ని నిరూపించుకోవడానికి మాత్రం జీవితకాలం పడుతుంది. అందుకే నమ్మకాన్ని ఎప్పుడూ కాపాడాలి.

**04** తియ్యగా మాట్లాడేవారంతా మనసున్నవారు కాదు. అవసరం ఉన్నప్పుడు ప్రేమగా పలకరించేవారు చాలా మంది ఉంటారు. మనకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలిచేవారే నిజమైన మనుషులు. మాటల కంటే చేతలకే విలువ ఎక్కువ.

**05** నిజాయితీ ఉన్నవాడు ప్రేమను నటించడు. సహాయం చేయలేకపోతే తప్పుడు హామీలు ఇవ్వడు. తనకు చేతనైనంత సహాయం చేసి నిశ్శబ్దంగా ఉంటాడు. అలాంటి మనుషులను జీవితంలో కోల్పోకండి.

**06** చనిపోయిన తర్వాత ఖర్చులు చేస్తామని చెప్పేవారి కంటే, మనం బ్రతికున్నప్పుడు తోడుగా నిలిచేవారే గొప్పవారు. అనారోగ్యంలో ఒక మందు ఖర్చు భరించడం, ఒక అవసరానికి అండగా నిలవడం ఎంతో విలువైనది.

**07** ఒంటరిగా ఉన్నప్పుడు మన బలం పరిమితమే. అందరం కలిసి నిలబడితే చిన్నవాళ్లు కూడా పెద్ద శక్తిగా మారతా రు. తేనెటీగల ఐకమత్యం మనకు గొప్ప పాఠం. ఐకమత్యమే మహాబలం.

**08** గొడవ జరిగినప్పుడే కొందరి అసలు స్వభావం బయటపడుతుంది. కోపంలో మాటలు అదుపు తప్పితే మనసులోని నిజమైన భావాలు బయటకు వస్తాయి. అందుకే కోపంలో నిర్ణయాలు తీసుకోకండి. ఒక్క నిమిషం మౌనం ఎన్నో సమస్యలను ఆపుతుంది.

**09** చెట్టు ఎంత బలంగా ఉన్నా కాలాన్ని బట్టి ఆకులు రాలుతాయి. అలాగే మనిషి ఎంత మంచివాడైనా జీవితంలో కష్టాలు తప్పవు. కష్టాలు శాశ్వతం కాదు, కాలం మారుతుంది. ధైర్యంగా ఉంటే కన్నీటి తర్వాత చిరునవ్వు వస్తుంది.

**10** డబ్బు కోసం ప్రతి బంధాన్ని కొలవకండి. డబ్బు వస్తుంది, పోతుంది, కానీ మనుషులు దూరమైతే తిరిగి రావడం కష్టం. మనశ్శాంతి, ఆప్యాయత, మంచి సంబంధాలే నిజమైన సంపద. డబ్బును ఉపయోగించండి కానీ డబ్బు కోసం జీవితాన్ని కోల్పోకండి.

మంచి మనసుతో జీవించండి.. మంచి మనుషులను గౌరవించండి.. మనశ్శాంతిని కాపాడుకోండి.

# తాయత్తులు ఉరి తాళ్లలా మారుతాయా?

మన దేశంలో వైద్యం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మూఢ నమ్మకాలు ఉంటున్నాయి. ఏదైనా అనారోగ్యం లేదా అనుకొని సంఘటనలు జరిగితే వైద్యుల కంటే ముందుగా భూత వైద్యుడిని సంప్రదిస్తారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువగా ఏడ్చినా.. అనారోగ్యం కలిగినా.. తాయత్తులు కట్టిస్తారు. అయితే ఈ తాయత్తులు ఒక్కోసారి ఉరి తాడు లాగా మారే ప్రమాదం ఉందని ఓ వైద్యుడు హెచ్చరించాడు. ఎందుకంటే?



ఇటీవల ఓ చిన్నారికి అనారోగ్యం కలగడంతో పిల్లల వైద్యుడు దగ్గరికి వచ్చారు. అయితే ట్రీట్మెంట్ చేస్తున్న సమయంలో ఆ చిన్నారి మెడలో ఉన్న తాయత్తులు చూసి డాక్టర్ షాక్ అయ్యాడు. ఆ చిన్నారి మెడలో చాలావరకు తాయత్తులు ఉండడంతో అవి అనుకోని విధంగా మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చాడు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వైద్యుడిని సంప్రదించాలని.. ఇలాంటి మూఢనమ్మకాల వైపు వెళ్లొద్దని చెప్పారు. అంతేకాకుండా ఈ తాయత్తులపై చేసే ఖర్చుతో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని.. అలా అందిస్తే అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

అయితే చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ చిన్న పిల్లల మెడలో తాయత్తులు కనిపిస్తూనే ఉంటాయి. ఒకవేళ వీటిని తల్లిదండ్రులు బాగా నమ్మితే.. వారి మెడలో జాగ్రత్తగా ధరించాలి. దారం బిగుతుగా ఉంటే చిన్న పిల్లలు ఆడుకుంటూ మెడకు చుట్టుకొనే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని వైద్యులు తెలుపుతున్నారు. ఎక్కువగా రాత్రిళ్ళు పిల్లలు ఏడుస్తున్నారని వీటిని మెడకు కడుతూ ఉంటారు.. కానీ నోటి సమస్యలు లేదా నిద్రలేమి సమస్యలు, గ్యాస్, కడుపునొప్పి వంటి సమస్యలతో వీరు రాత్రిళ్లు ఏడుస్తారని వైద్యులు తెలుపుతున్నారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వైద్య సలహా మేరకు అందుబాటులో ఉన్న మెడిసిన్ ఉపయోగించాలని తెలుపుతున్నారు.

అలా కాకుండా మూఢనమ్మకాలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తే.. చికిత్స ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో మరింత ప్రమాదానికి గురవుతారని వైద్యులు చెప్తున్నారు.



# ఒకే స్త్రీతో.. ఏడుసార్లు ప్రేమలో..

ఒక మనవడు తన 80 ఏళ్ల తాతగారిని ఇలా అడిగాడు
"తాతయ్యా.. మీరు ఒకే స్త్రీని 60 ఏళ్ల పాటు ఎలా ప్రేమించగలిగారు?"
మనవడు తాతయ్య నుండి ఇలాంటి సమాధానాలు వస్తాయని ఊహించాడు
"పరస్పర అవగాహన ఉండాలి..."
"మనసు విప్పి మాట్లాడుకోవాలి..."
"సర్దుకుపోవడం, రాజీ పడటం నేర్చుకోవాలి..."
కానీ తాతగారు చిరునవ్వు నవ్వి, క్షణం పాటు బామ్మ వైపు చూసి ఇలా అన్నారు:
"నేను ఒకే స్త్రీని 60 ఏళ్ల పాటు ప్రేమించానని నీతో ఎవరు చెప్పారు?"
ఆ మాటకి మనవడు ఆశ్చర్యపోయాడు.
తాతగారు కొనసాగిస్తూ..



**మొదటి ప్రేమ:** "20 ఏళ్ల వయసులో, ఆమె సౌందర్యానికి, ఆమె ఉత్సాహభరితమైన మనస్తత్వానికి ముగ్ధుడై ప్రేమలో పడ్డాను.

**రెండవ ప్రేమ:** 30 ఏళ్ల వయసులో, ఆమె ఒక తల్లిగా మారింది. రాత్రంతా నిద్రపోకుండా, మన పాపాయిని ఒడిలో జోలపాడి నిద్రపుచ్చిన ఆ మాతృమూర్తిని చూసి మళ్లీ ప్రేమలో పడ్డాను.

**మూడవ ప్రేమ:** 40 ఏళ్ల వయసులో, కుటుంబ బాధ్యతల భారమంతటినీ పెదవులపై చిరునవ్వుతో మోసిన ఆ ధైర్యవంతురాలైన స్త్రీతో ప్రేమలో పడ్డాను.

**నాల్గవ ప్రేమ:** 50 ఏళ్ల వయసులో, మన పిల్లల భవిష్యత్తు కోసం తన స్వంత కలలను, ఆశలను త్యాగం చేసిన ఆ సమర్పణ భావంతో ప్రేమలో పడ్డాను.

**ఐదవ ప్రేమ:** 60 ఏళ్ల వయసులో, ఆమె ముఖంలో ముడతలు వచ్చాయి. కానీ నా ఒక్క చూపుతోనే నా బాధ, ఆందోళనను అర్థం చేసుకునే జీవిత భాగస్వామితో ప్రేమలో పడ్డాను.

**ఆరవ ప్రేమ:** 70 ఏళ్ల వయసులో, ప్రతీ రోజూ క్రమం తప్పకుండా 'టాబ్లెట్లు వేసుకున్నారా?' అని అడిగే ఆ ప్రేమమూర్తితో ప్రేమలో పడ్డాను. ఆప్యాయత హృదయాన్ని తాకింది.

**ఏడవ ప్రేమ:** ఇక ఇప్పుడు, 80 ఏళ్ల వయసులో.. నా పక్కనే నెమ్మదిగా అడుగులు వేస్తూ, పాత జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ చెబుతూ, నాతో కలిసి నవ్వే ఈ తోటి ప్రయాణీకురాలితో ప్రేమలో ఉన్నాను."

మనవడు నిశ్చేష్టుడై ఉండిపోయాడు.
తాతగారు చిరునవ్వుతో ఆఖరిగా ఇలా అన్నారు:
"వివాహం అంటే జీవితాంతం ఒకేలా ఉండే వ్యక్తితో కలిసి జీవించడం కాదు.
కాలం మారే కొద్దీ.. రకరకాల రూపాలుగా మారే అదే వ్యక్తితో, పదే పదే మళ్లీ మళ్లీ ప్రేమలో పడటం నేర్చుకోవడం!"

అందం మారుతుంది.
వయసు మారుతుంది.
శరీరం మారుతుంది.
పరిస్థితులు మారుతాయి.

కానీ ప్రతీ మార్పులోనూ, మీరు మీ భాగస్వామి వైపు చూసి... "ఈ రోజుకీ నా మనసుకి నచ్చిన ఏకైక వ్యక్తివి నువ్వే!" అని చెప్పగలిగితే...

అదే దీర్ఘకాలిక, సంతోషకరమైన వైవాహిక జీవితం యొక్క అసలైన రహస్యం.
ఎందుకంటే..
ప్రేమ అంటే ఒక్కసారి మాత్రమే ప్రేమించడం కాదు.

నిజమైన ప్రేమ అంటే... జీవితంలోని ప్రతీ దశలోనూ, అదే వ్యక్తితో పదే పదే కొత్తగా ప్రేమలో పడటం.
ఇక్కడ మనం వేసుకోవాల్సిన అత్యంత అందమైన ప్రశ్న ఏమిటంటే
"ఈ రోజు మీతో ఉన్న జీవిత భాగస్వామి, మీరు మొదట ప్రేమించిన ఆ పాత వ్యక్తి మాత్రమేనా..? లేదా కలసి పంచుకున్న ఏళ్లు, పడిన కష్టాలు, చేసిన త్యాగాలు మరియు తీపి జ్ఞాపకాలతో రూపుదిద్దుకున్న ఒక కొత్త అందమైన వ్యక్తిగా మారారా?"
నిజమైన ప్రేమ అంటే ఇద్దరూ ఒకేలా ఉండిపోవడం కాదు.. ఇద్దరూ కలసి మారుతూ, ప్రతీ రోజూ ఒకరినొకరు మళ్లీ మళ్లీ ఎంచుకోవడం!

# రాత్రి తెలియని దేశాలు


ఫిన్ ల్యాండ్


నార్వే

ప్రపంచంలోనే భారతదేశంతో పాటు కొన్ని దేశాల్లో 12 గంటల పాటు రాత్రి.. 12 గంటలపాటు పగలు ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో నిత్యం పగలు.. మరి కొన్ని ప్రాంతాల్లో నిత్యం రాత్రి ఉంటుందన్న విషయం చాలామందికి తెలియదు. భూమి 30 డిగ్రీల కోణంలో వంగి భ్రమణం చెందడంతో ఈ దేశాలపై నిత్యం సూర్యకిరణాలు పడుతూ ఉంటాయి. అలాగే మరికొంత కాలం వ్యతిరేక దిశలో భ్రమణం చేయడంతో సూర్య కిరణాలు పడకుండా రాత్రి ఉంటుంది. ఇలాంటి పరిస్థితి ఎదుర్కొన్న ఈ ఆరు దేశాల గురించి తెలుసుకుందాం..

**పిన్ ల్యాండ్**
ల్యాండ్ ఆఫ్ ది మిడ్ నైట్ గా పేర్కొనే ఈ దేశంలో ఉత్తర ప్రాంతాల్లో ఎక్కువసేపు సూర్యుడు కనిపిస్తూనే ఉంటాడు. ముఖ్యంగా లాఫ్ లాండ్ ప్రాంతంలో సూర్యుడు 50 రోజులపాటు నిరంతరంగా కొనసాగుతాడు. అర్ధరాత్రి సమయంలో కూడా ఇక్కడ సూర్యుడు కనిపించడం విశేషం.

**ఐస్లాండ్**
ఆర్కిటిక్ సర్కిల్ లో ఉన్న ఈ దేశం లో వేసవికాలం పూర్తిగా చీకటిగా మారదు. ముఖ్యంగా జూన్ నెలలో అర్ధరాత్రి సమయంలో కూడా ఆకాశంలో సూర్యుడు కనిపిస్తాడు. అంతేకాకుండా ఇక్కడ సూర్యుడు 24 గంటల పాటు ఒకే దిశలో ఉన్నట్లు తెలుస్తుంది.


అలస్కా

**అలస్కా**
అమెరికాలోని అలాస్కా దేశం అంటార్కిటికా ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. ఈ దేశంలో దాదాపు 51 రోజులపాటు సూర్యుడు నిరంతరం కనిపిస్తూనే ఉంటాడు. వేసవికాలంలో ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. ఒకప్పుడు రష్యా ఆధీనంలో ఉన్న ఈ దేశాన్ని అమెరికా కొనుగోలు చేసింది.

**కెనడా**
ప్రపంచంలోని అతిపెద్ద దేశాల్లో కెనడా కూడా ఉంటుంది. ఈ దేశం ఆర్కిటిక్ సర్కిల్లో ఉంటుంది. ఇక్కడ వేసవికాలంలో 51 రోజులపాటు సూర్యుడు కనిపిస్తాడు. అందుకే ఇక్కడ మిడ్ నైట్ సన్ అని కూడా పిలుస్తారు. కెనడా దేశంలోని నునావుట్, నార్త్ వెస్ట్ టెరిటరీస్ వంటి ప్రాంతాల్లో సూర్యుడు ఒకే మాదిరిగా కనిపిస్తాడు.

**నార్వే**
ప్రపంచంలోని అందమైన దేశంగా పేర్కొనే నార్వేలో కూడా సూర్యుడు కొన్ని వారాలపాటు అస్తమించకుండా ఉంటాడు. ముఖ్యంగా స్మాల్ బార్డ్ వంటి ప్రాంతంలో ఈ దృశ్యాన్ని చూడొచ్చు. మే 31 నుంచి జూలై 31 వరకు దాదాపు 90 రోజులపాటు ఇక్కడ సూర్యుడు కనిపిస్తూనే ఉంటాడు.

**స్వీడన్**
ఈ దేశంలో సూర్యుడు 100 రోజులపాటు నిరంతరంగా కనిపిస్తాడు. ఇది కూడా ఆర్కిటిక్ సర్కిల్ లో కనిపిస్తుంది.



# నందీశ్వరుడు శివుడికి వాహనం ఎలా అయ్యాడు?

మనం శివాలయానికి వెళ్ళినప్పుడు ముందుగా నందీశ్వరుడిని దర్శించుకుంటాం. అలాగే నంది చెవిలో ఏవైనా కోరికలు చెబితే వెంటనే తీరుతాయని అంటుంటారు. నందీశ్వరుడు లేని శివాలయం ఎక్కడ కనిపించదు. అసలు నందీశ్వరుడు ఎవరు? ఆయన శివుడికి వాహనంగా ఎందుకు మారాల్సి వచ్చింది? వృషభం రూపం నందీశ్వరునికి ఎవరు ఇచ్చారు? ఈ ఆసక్తికరమైన కథ మీకోసం..

హిందూ పురాణాల్లో త్రిమూర్తుల్లో భక్తుల కోరికలను వెంటనే తీర్చే బోలా శంకరుడిని నిత్యం పూజిస్తూ ఉంటారు. ఇందులో భాగంగా పూర్వకాలంలో శిలాధుడు అనే మహర్షి నిత్యం శివరామ స్మరణం లోనే ఉండేవాడు. తన జన్మ మొత్తం శివుడికి అంకితం అన్నట్లు భావించేవాడు. తనకు జీవితంలో ఎలాంటి కోరికలు లేవని కానీ ఒక ప్రశ్న మిగిలి ఉందని భావించేవాడు. ఎందుకంటే ఎన్నో వేదాలు, విద్య, పాండిత్యం నేర్చుకున్న ఆయన తన జ్ఞాన సంపాదను మరొకరికి పంచాలని కోరికను కలిగినాడు. ఇందు కోసం వారసుడు కావాలని అనుకున్నాడు.

ఇందులో భాగంగా హిమాలయాల్లోకి వెళ్లి శిలాధుడు అత్యంత కఠినమైన తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన మహాశివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతాడు. దీంతో తనకు పుత్రుడు కావాలని అడగగా శివుడు అనుగ్రహిస్తాడు. కొన్ని రోజుల తర్వాత యజ్ఞభూమిని తయారు చేస్తున్న సమయంలో ఒక దివ్యమైన బాలుడు శిలాధుడికి కనిపిస్తాడు. ఈ బాలుడు ఆ మహా శివుడి వరమే అని అనుకొని అతడిని చేరదీస్తాడు. అతడికి నంది అని పేరు పెడతాడు. ఆ తర్వాత తనకు జ్ఞానాన్ని బోధిస్తాడు. అయితే ఎనిమిదేళ్లలోనే నందీశ్వరుడు అపార జ్ఞానాన్ని పొందుతాడు.

నందీశ్వరుడు హిమాలయాల్లోకి వెళ్లి కఠినమైన తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతాడు. అప్పుడు నందీశ్వరుడు తనకేం కోరికలు లేవని తన జీవితం మొత్తం మీ పాదాల వద్ద సేవ చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరుతాడు. దీంతో శివుడు నందీశ్వరుడి కోరికను నెరవేస్తాడు. అయితే శివుడు తన శూలం ద్వారా వచ్చే కాంతిని నందీశ్వరునిపై వేయగా.. అప్పటి వరకు ఉన్న మానవ రూపం నుంచి నందీశ్వరుడు వృషభరూపంలోకి మారతాడు. శివుడు నందీశ్వరుడికి కొన్ని విషయాలను చెబుతాడు.. తన గుణ గణాల నుంచి కొన్నిటిని నందీశ్వరుడికి ప్రసాదిస్తున్నట్లు.. ఇకనుంచి నా దర్శనం కావాలంటే ముందుగా నిన్ను దర్శిం చుకోవాలని చెబుతాడు. కైలాసానికి క్షేత్రపాలకుడిగా నందీశ్వరుడని నియమిస్తాడు.

ఆ విధంగా శిలాధుడి తపస్సు కారణంగా నందీశ్వరుడి జననం.. ఆ తర్వాత మహా శివుడి వద్ద ఉండడానికి కారణం అయింది. అయితే నందీశ్వరుని చెవిలో కోరికలు చెబితే తీరుతాయని అంటుంటారు. ఎందుకంటే మహాశివుడు నిత్యం ధ్యానంలో మునిగిపోతాడు. ఈ సమయంలో శివుడి ధ్యానానికి భంగం కలిగిస్తే ఆగ్రహం వ్యక్తం చేస్తాడు. అందువల్ల తమ కోరికలను నందీశ్వరుడికి చెబితే ఆ కోరికలను శివుడికి చేరవేరుస్తారని భక్తులు నమ్ముతారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



**సోయాతో జీర్ణక్రియకు ఉపయోగకరం**



సోయాలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి సహాయ పడుతుంది. మలబద్ధకం సమస్యను తగ్గించడం లోనూ తోడ్పడవచ్చు.



## క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

**- 30 లక్షల నగదు స్వాధీనం**

**ముద్ర, కూకట్ పల్లి:**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'ఇండిస్ వన్ సిటీ' అపార్ట్‌మెంట్‌లో కిడ్నాప్ జరుగుతోందంటూ డయల్–100కు వచ్చిన ఒక ప్రాంక్ కాల్‌ను ఛేదించిన పోలీసులు, ఏకంగా ఒక ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ దాడిలో రూ.30,00,000 నగదుతో పాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

కేపీహెచ్‌బీ పరిధిలోని ఇండిస్ వన్ సిటీలో ఒకరిని కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు డయల్–100 ద్వారా సమాచారం అందింది. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అయితే, ఆ కాల్ కేవలం ప్రాంక్ కాల్ అని తేలింది. అదే సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఒక ఫ్లాట్‌లో పంచుల సమక్షంలో సోదాలు నిర్వహించగా ఆన్‌లైన్ బెట్టింగ్ భాగోతం బయటపడింది.

నిందితులు దేసినేని సుమంత్ (25), మకాటి మనోజ్ (29), కనుమూరి గౌతమ్ చౌదరి (29)గా గుర్తించారు. వీరు టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా క్రికెట్ అంచనాలు ఇస్తూ, కమిషన్ ప్రాతిపదికన వివిధ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్లు నిర్ధారణ అయింది.

ఎస్ఐ పికె రాజు అందించిన ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

**ముద్ర ప్రతినిధి, తాండూర్:**

వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండల కేంద్రంలోని శ్రీ జగ్జీవన్ రామ్ విగ్రహం సమీపంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 1,020 గ్రాముల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు ఆగస్టు 22న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు బ్యాగ్‌తో వచ్చిన అనుమానితుడిని అదుపులోకి తీసుకుని, పంచ సాక్షుల సమక్షంలో తనిఖీ చేసి 1,020 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.34 వేలుగా అంచనా వేశారు.

నిందితుడిని బీహార్‌కు చెందిన మొహమ్మద్ ముస్తకీమ్ (44)గా గుర్తించారు. అతనిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై ప్రశాంత్ వర్ధన్ కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పాముకాటుతో మహిళ మృతి

**ముద్ర ప్రతినిధి, తాండూర్.**



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం జనగాం గ్రామ శివారులో పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సుమారు నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం భర్త, పిల్లలతో కలిసి జనగాం గ్రామానికి వచ్చిన ఆమె, అక్కడి ఓ ఫామ్‌హౌస్‌లో కాపలాదారుగా, లేబర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తోంది.

ఆగస్టు 23న అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో లేబర్ రూమ్‌లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని పాము కాటువేయడంతో ఆమె కేకలు వేసింది. వెంటనే భర్త, స్థానికుడి సహాయంతో ఆటోలో తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించి స్నేక్ బైట్ ఇంజక్షన్ ఇచ్చినా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా వికారాబాద్ సమీపంలో శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఏర్పడటంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఫిర్యాదు మేరకు పెద్దేముల్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడంతో పాటు చట్టప్రకారం దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

## పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

**ముద్ర, చేవెళ్ల:**

శంకర్ పల్లి పురపాలిక పరిధిలోని బీడీ ల్ కూడలి సమీపంలో నూతనంగా నిర్మిం చిన పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. సోమవారం పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలిక ఛైర్మెన్ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, చం ద్రమౌళి, కృష్ణారెడ్డి, శశిదర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, సత్తిరెడ్డి, గోపాల్ రెడ్డి, ఆనంద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక రిజర్వేషన్ల రద్దు డిమాండ్ సిగ్గుచేటు

**- జాజుల శ్రీనివాస్ గౌడ్**

**ముద్ర, హైదరాబాద్:**



దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక రిజర్వేషన్లను రద్దు చేయాలని ఢిల్లీలో ఆందోళన చేపట్టడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాలని బీసీలు పోరాడుతుంటే, రిజర్వేషన్ వ్యతిరేకులు ఆన్ లైన్‌తో పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఉద్యమాలు చేపడుతున్నారని ఆరోపించారు. మండల్ ఉద్యమ సమ యంలో రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారి వారసులే ప్రస్తుతం సామాజిక రిజర్వేషన్లపై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు ముందుగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

దేశ సంపద, సహజ వనరులు కొద్ది మంది కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు, భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతమై ఉన్న పరిస్థితి మారాలని ఆయన అన్నారు. సంప దను సమానంగా పంపిణీ చేసిన తర్వాతే రిజర్వేషన్లపై చర్చ జరగాలని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆరోగ్యం వంటి మౌలిక అవకాశాలు అందడం లేదన్నారు. రిజర్వేషన్ వ్యతిరేకులు వాస్తవాలను గుర్తించి సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమసమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక రిజర్వేషన్లపై వ్యతిరేక ప్రచారం కొనసాగితే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఐక్యంగా స్పందిస్తారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస ముదిరాజ్,బిసి జేఏసి రాష్ట్ర కో చైర్మన్ పిట్ల శ్రీధర్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మడత వెంకట్ గౌడ్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు

## అధికారంలోకి వస్తే తీజ్ పండుగను అధికారికంగా నిర్వహిస్తాం

**- తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత**

**ముద్ర, హైదరాబాద్:**



తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే తీజ్ పండుగను అధికారికంగా నిర్వహించడంతో పాటు, బంజారా ఆడబిడ్డల కోరిక మేరకు మూడు రోజుల సెలవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు ఉపవాసం ఉండి, నేలపై నిద్రిస్తూ తీజ్ పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తున్న బంజారా మహిళల సేవలను కొనియాడారు. సంప్రదాయ దుస్తులు, ఆచారాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సింగరేణి కాలనీల్లో గత 30 ఏళ్లుగా గుడిసెలు, మురికి కాల్వల పరిస్థితిలో పెద్ద గా మార్పు రాలేదని విమర్శించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో సామాజిక న్యాయ సంకల్పాన్ని తీసుకున్నామని తెలిపారు. ఆగస్టు 6న హైదరాబాద్‌లో నిర్వహించిన సభ ద్వారా సమాజంలో మార్పు కోసం తమ ప్రయత్నాలను ప్రారంభించామని కవిత పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు కాపాడబడాలని స్పష్టం చేశారు. బంజారా సమాజంతో తెలంగాణ రక్షణ సేనకు ఉన్న అనుబంధం కొనసాగుతుందని తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్యక్రమానికి హాజరైన బంజారా ప్రజల ధైర్యం, పట్టుదలను అభినందించారు. సంస్కృతి, సంప్రదాయాలకు బంజారా ప్రజలు ఇస్తున్న గౌరవాన్ని కొనసాగించాలని, తెలంబగాణ రక్షణ సేనతోనే సామాజిక న్యాయ తెలంగాణ సాధ్యమని ఆమె స్పష్టం చేశారు.

## మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించాలి

**- పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, హైదరాబాద్:**



మియాపూర్ డివిజన్ పరిధిలోని జనచైతన్య కాలనీలో సీఎంసీ యూబీడీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. సీఎంసీ అదనపు కమిషనర్ సుభద్ర దేవి, డీసీ శ్రీనివాస్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జనచైతన్య కాలనీ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మానవాళి మనుగడకు, సమస్త జీవరాశికి మొక్కలే ప్రాణాధారమని పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించారని, భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

మారేడు, వెలగ, జమ్మి వంటి స్థానిక జాతులతో పాటు రుద్రాక్ష, గంధం, ఎర్ర చందనం వంటి మొక్కలకు పర్యావరణ, ఔషధ, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఖాళీ స్థలాలు, రహదారుల వెంట అనువైన ప్రాంతాలను గుర్తించి విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా చిన్న పిల్లలను పెంచినట్లు వాటిని సంరక్షించాలని కోరారు. వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్న యూబీడీ విభాగాన్ని గాంధీ అభినందించారు. పచ్చదనం, జీవ వైవిధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఆరోగ్యకరమైన, సుస్థిరమైన పట్టణ వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూబీడీ మేనేజర్లు సతీష్ బాబు, విక్రమ్ చంద్ర, నాయలు ప్రతాప్ రెడ్డి మరియు జనచైతన్య కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, ఇగ్నైట్ కలశాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ పోటీ పరీక్షలకు టి-శాట్ డిజిటల్ కంటెంట్

**- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి**

**శేరిలింగంపల్లి, ముద్ర:**

తెలంగాణలో పోలీసు ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు టి–శాట్ నెట్వర్క్ ప్రత్యేక డిజిటల్ కంటెంట్ అందించేందుకు సిద్ధమైంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహించే 7,437 పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు డిజిటల్ పాఠ్యాంశాలను రూపొందించింది. ప్రసారాలకు సంబంధించిన వివరాలను టి–శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వివరించారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో నియామకాల్లో వయస్సును సైతం సడలించారని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా యువతకు డిజిటల్ కంటెంట్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 24వ తేదీ సోమవారం ఉదయం 11 నుండి ఒంటి గంట వరకు 12 సబ్జెక్ట్ లపై ఎక్స్ పర్ట్స్ చే ఐదు రోజుల పాటు ప్రత్యేక లైవ్ ప్రసారాలుంటాయని తెలిపారు. వీటితో పాటు సుమారు 600 గంటల రికార్డెడ్ కంటెంట్ విద్య ఛానల్ లో 24వ తేది సోమవారం ఉదయం ఎనిమిది నుండి పది గంటల వరకు, నిపుణలో ఏడు నుండి తొమ్మిది గంటల వరకు పరీక్షలు నిర్వహించే తేది నాటికి ప్రసారాలు కొనసాగుతాయన్నారు. టి–శాట్ నెట్వర్క్ కు చెందిన శాటిలైట్, డిజిటల్ మాధ్యమాల ద్వారా పోలీస్ పోటీ పరీక్షల కంటెంట్ అందుబాటులో ఉంటుందని, మాక్ టెస్టులను సైతం నిర్వహిస్తుందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రసారాలను యువత సద్వినియోగం చేసుకొని రాబోయే పోటీపరీక్షల్లో రాణించాలని, మాక్ టెస్టులను సైతం వినియోగించుకుని తమ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సీఈవో సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై రామ కృష్ణాపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. చింతకాని సబ్‌ఇన్‌స్పెక్టర్ జి. నరేష్ తెలిపిన ప్రకారం.. కామేపల్లి మండలం ముచ్చెర్ల గ్రామానికి చెందిన జాని అనే యువకుడు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### 14 దేశాల్లో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుల నియామకం

**ముద్ర, హైదరాబాద్:** విదేశాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో 14 దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిని కూడా నియమించారు. నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

**వివిధ దేశాల అధ్యక్షులు:**

ఆస్ట్రేలియా – కిషోర్ కత్తి, యూకే – సుమన్ రావు బాల్మూరి, కెనడా – వెంకట్రామణ్ మెట్ పల్లి, ఇటలీ – తానింకి కిషోర్ యాదవ్, మాల్టా – పింటూ ఘోష్, పోర్చుగల్ – ప్రకాష్ పొన్న కంటి, యూఏఈ – శేఖర్ గౌడ్ ఆరె, కువైట్ – మార్క ప్రమోద్ గౌడ్, జింబాబ్వే – బెమ్మడి మహేందర్ రెడ్డి, ఖతార్ – శేఖర్ చిలువూరి, ఫిన్లాండ్ – సందీప్ రెడ్డి ఐరెడ్డి, నార్వే – ప్రసాద్ రావు బిక్కినేని, సౌదీ అరేబియా – మొజ్జం అలీ ఇఫ్తేకర్, ఐర్లాండ్ – జయంత్ రెడ్డి మెట్టు.

మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్ను నియమించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కొత్తగా నియమితులైన అధ్యక్షులకు కల్వకుంట్ల కవిత సూచించారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ముద్ర, హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్–భువనగిరి డీఎన్ లైన్‌లోని కిలోమీటర్ నంబర్ 215/5–7 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 50–55 సం.లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్లటి బనియన్, ఆఫ్ బ్లూ రంగు లుంగీ, నల్లటి గీతలున్న కాఫీ రంగు డ్రాయర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పొట్టపై 'AMOLE' అనే గుర్తు ఉన్నట్లు పేర్కొన్నారు. 9440083160, 871 26 58581 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 24.08.2026
www.mudranews.in | @mudranews


## సోయాతో మహిళల ఆరోగ్యానికి తోడ్పాటు

సోయాలోని ఐసోఫ్లేవోన్లు ఈస్ట్రోజెన్‌ను పోలిన ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా మెనోపాజ్ సమయంలో వచ్చే కొన్ని లక్షణాలను తగ్గించడంలో కొంతమందికి ఉపయోగపడవచ్చు.



## వృద్ధుల సమస్యలు, మానవ సంబంధాల విలువను చాటిన 'పళ్ళ బురుసు'

**ముద్ర, హైదరాబాద్:** వృద్ధాప్యం, ఒంటరితనం, మానవ సంబంధాల విలువను ఆలోచింపజేసేలా రూపొందిన 'పళ్ళ బురుసు' చిత్రం అభినందనీయమని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కె. నారాయణ అన్నారు. ఇలాంటి ప్రయోజనాత్మక, సామాజిక స్పృహ కలిగించే చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆయన కోరారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'పళ్ళ బురుసు' చిత్రాన్ని ఈ నెల 22న కొండాపూర్ లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో దర్శకుడు, కథా రచయిత ఉదయ్ చౌహాన్, సహనిర్మాత అధీప్ అయ్యర్ తదితర అన్నపూర్ణ స్టూడియోస్ బృందం ప్రదర్శించింది. వృద్ధాశ్రమంలోని సభ్యులు చిత్రాన్ని ఆసక్తిగా వీక్షించారు. సినిమాలోని పాత్రలు, పరిస్థితులను తమ జీవితాలతో అన్వయించుకుని వృద్ధులు ఆనందించారని నారాయణ తెలిపారు. వృద్ధాప్యంలో స్నేహం, ఆత్మీయత, అనుబంధాలు ఎంత ముఖ్యమో ఈ చిత్రం చాటిచెప్పిందన్నారు. వయస్సు మళ్లిన వారి సహజమైన కోర్కెలు, ఒంటరితనాన్ని భరించడం ఎంత కష్టమో, మిత్రుల ఆత్మీయ కలయిక ఎంతటి ఆనందాన్ని కలిగిస్తుందో సినిమాలో చక్కగా చూపించారని పేర్కొన్నారు.కార్ల్ మార్క్స్ చెప్పిన "సకల మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే" అనే భావన కూడా సినిమాలో ఒక కోణంలో ప్రతిబింబిస్తుందని నారాయణ అన్నారు. ఇలాంటి చిత్రాలు వినోదంతో పాటు సామాజిక సమస్యలపై చర్చకు దారితీస్తాయని చెప్పారు.కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విలాసవంతమైన సినిమాలు నిర్మించి, అధిక టికెట్ ధరల పేరుతో ప్రజలపై భారం మోపే చిత్రాలకు ప్రభుత్వ సహాయం అందించడం కంటే, ప్రజలకు ఆలోచన, ఆనందం, సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యత అని కె. నారాయణ స్పష్టం చేశారు.

## ధర్మపురి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన హైకోర్టు న్యాయమూర్తి




**ముద్ర, జగిత్యాల న్యూస్:** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి అర్చకులు వేదాశీర్వచనం చేశారు. దేవస్థాన కార్యనిర్వహణా ధికారి సంకటాల శ్రీనివాస్ వారికి స్వామివారి చిత్రపటం అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. వారివెంట జగిత్యాల జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రత్న పద్మావతి, సూపరింటెం డెంట్ అల్వాల శ్రీనివాస్, అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సముద్రాల వంశీకృష్ణ , అభిషేకం పురోహితులు బొజ్జా రాజగోపాల్, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ సధాకర్ , రవీందర్ తదితరులు ఉన్నారు.

## పార్టీకి డ్యామేజ్ చేస్తే చర్యలు తప్పవు..

**- వాకిటి శ్రీహరి సంచలన వ్యాఖ్యలు!**



**ముద్ర, హైదరాబాద్ :** సురేఖ కూతురు మాట్లాడింది పార్టీకి డ్యామేజ్ చేసేలాటి దేనని, ఇంకా ఎవరైనా ముందు పార్టీ తరువాతే అందరూ కలిసి ముందు పార్టీ నీ కాపాడుకోవాలని మంత్రి వాకిటిశ్రీహరి అన్నారు. దానికి అనుగుణంగా ముందుకు పోతామని, పార్టీ లైన్ దాటితే వాటికి శ్రీహరి పై కూడా చర్యలు తప్పదని అన్నారు.పార్టీకి డామేజ్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. సురేఖ అక్క పై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి లేదని ఫైర్ అయ్యారు. పార్టీకి డ్యామేజ్ అయితే పీసీసీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ లైన్ ఎవరు దాటొద్దు. ఆర్థిక వ్యవస్థ చిన్న బిన్నం అయిన ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చి అభివృద్ధి చేసిన.. అనుభవం కలిగిన పార్టీ రేవంత్ ప్రభుత్వం ముందుకు పోతుంటే ఇలాంటివి జరగటం బాధాకరం అని వాకిటి శ్రీహరి అన్నారు.

ప్రతి పక్షాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సురేఖ అక్క ఒక్కదానికే నోటీస్ ఇవ్వలేదు.. చిన్నారెడ్డికి కూడా క్రమశిక్షన కమిటీ నోటీస్ ఇచ్చారని అన్నారు. తప్పు చేస్తే ఎవరి పైన అయిన చర్యలు ఉంటాయని, సామాజిక న్యాయం పాటించేది కాంగ్రెస్ పార్టీ బీసీ అగ్రవర్ణాలు అని ఏముందదని వాకిటి శ్రీహని క్లారిటీ ఇచ్చారు.

## ఏపీ-తెలంగాణలకు వర్ష సూచన

**ముద్ర, హైదరాబాద్ :** దక్షిణాది రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. దీని కారణంగా నైరుతి రుతుపవనాలు జోరందుకున్నా, ఎల్ నినో కారణంగా కనీసం చినుకులు పడడం లేదు. దీంతో చినుకుల కోసం సామాన్యులతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఒడిశాపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కాస్త అల్పపీడనంగా మారినట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావం ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికారణంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశముంది. ఆదివారం నుంచి ఈనెల 28 వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవచ్చని తెలిపింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, తెలంగాణ ప్రాంతాలలో అక్కడక్కడా లేదా కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర, దక్షిణ కర్ణాటకలో ఆగస్టు 22 నుంచి 28 వరకు భారీ వర్షాలు పడే అవకాశ ఉందని పేర్కొంది.

హైదరాబాద్ సిటీ పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 గంటల నుంచి వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ముఖ్యంగా మల్కాజ్‌గిరి, కాప్రా, నాచారం, మల్లాపూర్, ఉప్పల్, నాగోల్, సికింద్రాబాద్, ఈసీఐఎల్, దమ్మాయిగూడ, చర్లపల్లి, బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, రామంతపూర్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. రాత్రంతా ఇదే పరిస్థితి నెలకొంది. ఆదివారం కూడా వాతావరణం దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇక తెలంగాణలోని మిగతా జిల్లాల విషయానికి వద్దాం. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, నిజామాబాద్, జగిత్యాల, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది.

# మోదీ 3.O బలహీనపడుతోందా..?

**మెతక వైఖరి దేనికి సంకేతం?**

**ముద్ర డెస్క్ :** నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు గణనీయమైన ఆధిపత్యం ప్రదర్శించాయి. వీధి ఉద్యమాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న మెతక వైఖరి, దాని నిర్ణయాల దృఢత్వంపై సందేహాలు తలెత్తిస్తోంది. తాజాగా ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ చేసిన ధర్నా చర్చనీయాంశమైంది.

**ప్రచార అవకాశం కల్పించి..**

పెల్లెట్ గాయాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ఐదున్నర గంటలపాటు రోడ్డుపై కూర్చుని ధర్నా చేశారు. అయితే లలితా కుమారి కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎఫ్ఐఆర్‌కు ముందు లోతైన దర్యాప్తు, చర్చలు అవసరం. ఆరు వారాల సమయం ఉన్నప్పటికీ, ధర్నా తర్వాతనే ఎఫ్ఐఆర్ నమోదు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో లెఫ్టినెంట్ గవర్నర్, హోం శాఖ అధికారుల అనుమతి అవసరం. అయినా ఈ ప్రక్రియకు ఐదున్నర గంటలు పట్టడం, లేదా ఉద్దేశపూర్వకంగా ప్రచార అవకాశం కల్పించడమా అనే ప్రశ్నలు బీజేపీ అనుచరుల్లోనూ వినిపిస్తున్నాయి. ముందే నమోదు చేసి ఉంటే ఈ మీడియా దృష్టి తప్పేది.



**ప్రతిపక్షాలకు కొత్త ఆయుధం..**

రైతు ఉద్యమాల తర్వాత మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిన సందర్భాలు ఉన్నాయి. దీన్ని హింస నివారణకు తీసుకున్న నిర్ణయంగా చాలామంది అభివర్ణించారు. అయితే ప్రతిపక్షాలు వీధి ఆందోళనల ద్వారా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయవచ్చని గ్రహించినట్లు కనిపిస్తోంది. నోయిడాలో కార్మికుల ఆందోళన వెనుక అర్బన్ నక్సల్ ప్రభావం ఉందని చెప్పబడుతున్నా, అది సాధారణ ప్రజలకు అంతగా తెలియలేదు. అభిజిత్ దీప్కే నేతృత్వంలోని నీట్ లీకేజీ వ్యతిరేక నిరసనలు, సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష వంటి సందర్భాల్లో ప్రభుత్వం సమయానుకూలంగా నియంత్రించలేకపోయింది. పార్లమెంటు సమీపంలో హింసాత్మక పరిస్థితులకు అవకాశం ఏర్పడటం ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లోపాన్ని సూచిస్తోంది.

**మెతక వైఖరి..**

నక్సలైట్ సమస్య, ఈశాన్య రాష్ట్రాలు, మణిపూర్, నాగాలాండ్‌లోని అల్లర్లను కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా అదుపులో ఉంచింది. కానీ ఢిల్లీ విషయంలో మెతక వైఖరి కనిపిస్తోంది. అభిజిత్ దీప్కే పాఠశాలలను సందర్శించడం లాంటి చర్యలు అధికారం లేకుండానే జరుగుతున్నాయి. ఇది ఉపాధ్యాయుల కార్యకలాపాలకు ఆటంకం కలిగించినా, ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. జెన్‌జీ ఉద్యమాలు ఉధృతం కాకుండా ఉండాలని కోరుకున్నా, అతి మెతక వైఖరి వల్ల వ్యతిరేక ప్రభావం పడుతుందని విమర్శలు వస్తున్నాయి.

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే పెల్లెట్ ఘటనలు, దాడులపై విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో అదనపు ఎఫ్ఐఆర్‌లు, ధర్నాలు అవసరమా అనే ప్రశ్న ఉంది. ప్రభుత్వం గతంలో చూపిన దృఢత్వాన్ని ఢిల్లీ వంటి కీలక ప్రాంతాల్లోనూ కొనసాగిస్తేనే దాని నిర్ణయాలపై నమ్మకం నిలుస్తుంది. లేనిపక్షంలో వీధి ఆందోళనలు మరింత బలపడి, పాలనా సామర్థ్యంపై ప్రశ్నలు తీవ్రమయ్యే అవకాశం ఉంది.

## కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు



**ముద్ర, కరీంనగర్ :** కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ కార్మికులకు కనీస వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ సంఘంలోకి పలువురు కార్మికులు చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ చేస్తున్న రాజీలేని పోరాటాలకు ఆకర్షితులై కార్మికులు తమ సంఘంలో చేరుతున్నట్లు చెప్పారు. ఇటీవల కార్మికుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన సూపర్వైజర్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మాదిగల హక్కుల సాధన కోసమే ఎంఆర్పీఎస్ పోరాటం

*** ఎంఆర్పీఎస్ గాగిరెడ్డిపల్లె, నవాబుపేట అనుబంధ సంఘాల నియామకం**

**ముద్ర చిగురుమామిడి :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంతో నేడు ఎస్సీ వర్గీకరణ ఎబిసిడి సాధించుకున్నామని ఎంఆర్పీఎస్ మండల ఇంచార్జి కాత మల్లయ్య అన్నారు.శనివారం చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లె, నవాబుపేట గ్రామాల్లో ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల కమిటీలను నియమించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్ ఎబిసిడి వర్గీకరణ లెక్క ప్రకారం 11 శాతం వాటా వచ్చేది ఉండే అటువంటిది మాదిగలకు 9 శాతం అమలవుతుందన్నారు. ఇంకా రెండు శాతం వచ్చేది ఉందని,దాని కోసం కూడా మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నార న్నారు. ఎంఆర్పీఎస్ ఉద్యమ పోరాటంలో మాదిగ సోదరులం అందరం ఐక్యతతో పాల్గొని మన హక్కులు పొందుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు.అందులో భాగంగానే పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్పీఎస్ జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కొత్త కమిటీల నియామకాలు చేపట్టామన్నారు.ఈ ఏడాది వరంగల్ పట్టణంలో నవంబర్ లేదా సెప్టెంబరు నెలలో నిర్వహించే ఎంఆర్పీఎస్ జాతీయ సదస్సుకు జాతీయ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు కొత్త కమిటీల నియామకాలు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు.నేడు అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీ,పెన్షన్,ఫీజు రియాంబర్స్మెంట్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాయంటే అది మంద కృష్ణ మాదిగ పోరాటమే అన్నారు.ఇక దళిత వర్గాల మహిళలపై జరుగుతున్న దాడులు వివక్షపై కూడా మహిళలు మేల్కోవాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారని అన్నారు.దళిత మహిళలు కూడా తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు.



ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారన్నారు.ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ గాగిరెడ్డిపల్లె అధ్యక్షుడిగా మంద శ్రీకాంత్ ను నవాబుపేట అధ్యక్షుడిగా బోయిని సతీష్ ను,ఎంఎస్పి నవాబుపేట అధ్యక్షుడిగా బోయిని లక్ష్మణ్, గాగిరెడ్డిపల్లె అధ్యక్షుడిగా మంద తిరుపతి, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా బోయిని రామ్ చరణ్,ఎంఎంఎస్ నవాబుపేట గ్రామ అధ్యక్షురాలిగా బోయిని సునీతను,ఆయా కమిటీ ల కార్యవర్గాలను నియమించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడెల్లి సంపత్,సీనియర్ నాయకుడు బోయిని ఆదిమల్లయ్య,మండల నాయకుడు జిల్లాలు సదయ్య, ఎంఆర్పీఎస్ నాయకులు బోయిని కొమురయ్య, శరయ్య, వెంకటయ్య,మంద చంద్ర శేఖర్,శ్రీకాంత్, నరేష్,హరీష్,మహిళా నాయకురాళ్లు బోయిని మల్లవ్వ,లచ్చవ్వ, కల్పన,సౌందర్య,రేణుక తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కాంగ్రెస్ శాపం..



**- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వమే శాపంగా మారిందని..ఎల్ నినో కాదు అని..పలు ప్రాజెక్టులలో నీళ్లు ఉన్నా విడుదల చేయకుండా రైతులకు అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్ మాజీ మంత్రి జీ.జగదీష్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. నీళ్లు ఇస్తే కరెంట్ కొనాలని, పంటలు వేస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని, పంట కొంటే బోనస్ ఇవ్వాల్సి ఉంటుందని ఎల్ నినో పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్ళు ఇవ్వడం లేదు అని జగదీష్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రైతు పరిస్థితి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఉండే దానికంటే ఎక్కువ అధ్వాన్నం అయిపోయిందని విమర్శించారు.పోలవరం నుంచి పట్టిసీమ నుంచి బ్రహ్మాండంగా నీళ్లు పోతున్నాయని..తెలంగాణలో మాత్రం గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల చేయడం లేదని అన్నారు.పెన్నా బేసిన్ లో వరద రాకున్నా రాయలసీమలో 52 శాతం వర్షపాతం తక్కువ ఉన్నా, మహబూబ్ నగర్ పరిధిలో ఉండే పంపులు ఇంతవరకు ఆన్ చెయ్యలేదు, ఈ ప్రభుత్వం గోదావరి , కృష్ణా బేసిన్ తెలంగాణ రైతులకు ద్రోహం చేస్తుందని జగదీష్ రెడ్డి ఆరోపించారు.నాగార్జున సాగర్ లో నీళ్ళు ఉన్నా, సాగర్ ఎడమ కాల్వ క్రింద ఉన్న రైతులకు నీళ్ళు ఇవ్వడం లేదని, ఎస్ఎల్బీసీ క్రింద నీళ్లు ఇవ్వడం లేదు అని దీంతో దేవరకొండ ప్రాంత రైతులు ధర్నా చేసే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. సాగర్ లో నీళ్లు ఉన్నాయో లేవో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగర్ లో దూకితే తెలుస్తుందంటూ సెటైర్లు వేశారు. 518 అడుగుల నీళ్ళు ఉన్నప్పుడే బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నీళ్ళు ఇచ్చిందని, సాగునీరు ఇచ్చారని పేర్కొన్నారు.

## తప్పు చేశాను.. అందుకే ఆమెతో రిలేషన్..

**ముద్ర, కరీంనగర్ :** ఫోక్ సాంగ్స్ యాక్టర్ ఈశ్వర్ సాయి ఇటీవల ఓ అమ్మాయితో గదిలో ఉండగా.. అతని భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈశ్వర్ సాయి పేరు నెట్టింట వైరల్ అవుతుంది. పలువురు నెటిజన్స్ అతన్ని ట్రోల్ చేస్తూ పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై ఈశ్వర్ సాయి స్పందించాడు. తాను చేసింది తప్పేనని..ఒత్తిడితో అలా చేయాల్సి వచ్చిందని చెప్పాడు.

**అందుకే మాధురికి కనెక్ట్ అయ్యా..**

గత కొన్నాళ్లుగా నేను ఒత్తిడిలో ఉన్నా. ఇంట్లో భార్యతో గొడవలు జరిగాయి. చాలా ప్రెజర్ ఉంది. అప్పుడే నాకు మాధురి కనెక్ట్ అయింది. నాకున్న ప్రెజర్‌కి..ఆమె చూపించిన కేరింగ్‌కి అట్రాక్ట్ అయ్యా. నాకు చాలా నచ్చింది. ఆమెతో నాకు ఐదేళ్లుగా పరిచయం ఉంది. కానీ మేమిద్దరం రిలేషన్ స్టార్ట్ చేసింది మాత్రం రెండున్నర నెలల క్రితమే. ఆమెతో ఎమోషనల్‌గా చాలా కనెక్ట్ అయ్యాను.

**చేసింది తప్పే..**

నేను చేసింది తప్పే. నేను ఉన్న ప్రెజర్‌లో ఆ తప్పు చేశా. ఆ సమయంలో మాధురితో కనెక్ట్ అవ్వడం కరెక్టే అనిపించింది. మ్యూచల్‌గానే మా ఇద్దరి మధ్యన రిలేషన్ నడిచింది. ఇది ఒప్పుకుంటున్నా. ఇలా చేయడం తప్పే కానీ..నా భార్య ఆ వీడియోని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం 200 శాతం తప్పు. కూర్చొబెట్టి మాట్లాడితే అందరి జీవితాలు బాగుండేవి. ఈ వీడియో పెట్టేసరికి ..ఇప్పుడు నేను బయటకు రాలేని పరిస్థితి. నాతో పాటు నా భార్య జీవితం కూడా నాశనం అయినట్లే కదా. ప్రస్తుతం నా మైండ్ పని చేయట్లేదు. అమ్మానాన్నలతో పాటు అత్తమామలను కూడా ఫేస్ చేయలేకపోతున్నా. నా భార్యను అయితే అసలే ఫేస్ చేయలేదు.అందుకే నేనొక్కడినే వేరే చోటుకి వచ్చేశా. ఇప్పుడు నేను సోషల్ మీడియాకు ఎంటర్‌టైనర్‌గా మారిపోయా. నాతో పాటు నా భార్య, మాధురి జీవితాలు కూడా నాశయం అయ్యాయి.

**మాధురికి చేతులెత్తి క్షమాపణలు చెబుతున్నా..**

మాధురి చాలా మంచి అమ్మాయి. నా వల్ల ఆమె జీవితం చాలా ఎఫెక్ట్ అయింది. ఫ్యామిలీ మొత్తం ఆమె మీదనే ఆధారపడి ఉంది. తమ్ముడిని చదివించడంతో పాటు కుటుంబ ఆర్థిక అవసరాలన్నీ ఆమెనే చూసుకుంటుంది. ఇప్పుడు ఈ వీడియో వల్ల ఆమె కెరీర్ నాశనం అయింది. ఆమెకు చేతులెత్తి క్షమాపణలు చెబుతున్నా. నా భార్య తరపున కూడా ఆమెకు సారీ చెబుతున్నా. అంతకు మించి నేను ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నా. ఒక్క చిన్న తప్పు చేసినంత మాత్రనా..మా క్యారెక్టర్‌నే ప్రశ్నిస్తున్నారు. నా గురించి తెలియని వాళ్లు కూడా నాపై నెగెటివ్‌గా మాట్లాడుతున్నాను. మీరు చూసింది కేవలం 10 శాతం మాత్రమే. చూడనిది 90 శాతం ఉంది. అవన్నీ చెప్పి ఈ ఇష్యూని మరింత పెద్దది చేయాలని లేదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



**సోయాతో బరువు నియంత్రణకు సహాయం**



ప్రొటీన్, ఫైబర్ కారణంగా సోయా ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించవచ్చు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంది.



## శ్రీస్వామి వారికి నవ కలశ పంచామృతాభిషేకం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఆదివారం ఏకాదశిని పురస్కరించుకొని శ్రీస్వామివారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి నిత్యార్చనలు పూర్తయిన తరువాత, నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.

స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారికి విశేషంగా సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.

## వలిగొండలో ఘనంగా బోనాల పండుగ



**ముద్ర, వలిగొండ:**

వలిగొండ పట్టణ కేంద్రంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ జరుపుకున్నారు డోలు డప్పు చప్పుళ్లు, నృత్యాల మధ్య శివసత్తుల ఆటపాటలతో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకెళ్లి శ్రీ ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు అనంతరం భక్తులు అమ్మవారిని వర్షాలు కురిసి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ముత్యాలమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించడం జరుగుతుందని, ముత్యాలమ్మ తల్లి చాలా మహిమగల దేవతని, కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ప్రజలు తెలిపారు.

## భువనగిరిలో బోనాల పండుగ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

భువనగిరి పట్టణంలోని పెద్దమ్మ తల్లికి ఆర్బి నగర్, అర్బన్ కాలనీ, తారకరామ నగర్ ప్రజలు, హనుమాన్ వాడ గంజ్ ప్రాంతంలోని ప్రజలు గ్రామ దేవతలు పోచమ్మ, బంగారు మైసమ్మలకు బోనాలు ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్య క్షుడు కొలుపుల హరినాథ్ ను పెద్దమ్మ దేవాలయం వద్ద ఆశాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ బోనాలు ఉత్సవ కమిటీ నాయకులు కొలుపుల వివేకానంద, గుర్రాల శీవ, మారబోయిన శంకర్, హరీష్, శివ పాల్గొన్నారు

## యాదాద్రి 22వ వార్డులో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని న్యూ రామ్ నగర్ లో డ్రైనేజి, సిసి రోడ్డు కొరకు నిధులు మంజూరు చేయాలనీ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కోరగా హెచ్.ఎం.డి.ఏ నిధుల నుండి మంజూరు చేయగా ఆదివారం స్థానిక కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల వెంకట నర్సయ్య, తోట కార్తీక్, ప్రమోద్,



మహేందర్, రాజేష్, కిషోర్ స్థానికులు సహదేవ్, కృష్ణ, మధు పాల్గొన్నారు.

## తుల్స్యా నాయక్ మృతి బాధాకరం

**- బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కేతావత్ భీల్యానాయక్**

**ముద్ర, దేవరకొండ:**

డిండి మండలంలోని సింగరాజు పల్లి తండాకు చెందిన వడ్త్య తుల్స్యా నాయక్ మృతి బాధాకరం అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు. తుల్స్యా నాయక్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వడ్త్య లాలూ నాయక్, వడ్త్య శ్రీను సర్పంచ్ లక్ష్మి



పతి , సర్పంచ్ కిషన్ నాయక్ , కేతావత్ హరిలాల్ నాయక్ ,సైదులు గోరంట్ల, జంగయ్య , లాల్ సింగ్ , మాజీ ఉప సర్పంచ్ ధనలక్ష్మి , నర్స్యా నాయక్, రాజు నాయక్ , నేనావత్ నాగార్జున , లక్ పతి తదితరులు ఉన్నారు.

# ఘనంగా గౌలిగూడ గురుద్వారా శతాబ్ది వేడుకల మారథాన్

**- 5,000 మందికి పైగా పాల్గొనగా 3కే, 5కే రన్స్, ఫ్యామిలీ వాక్‌థాన్**

**ముద్ర, హైదరాబాద్:**

గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహిబ్ 100 ఏళ్ల చారిత్రక ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో శతాబ్ది మారథాన్ ఘనంగా నిర్వహించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 5,000 మందికి పైగా పాల్గొన్నారు. "రన్ ఫర్ ఫెయిత్, రన్ ఫర్ సేవా" నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 3కే, 5కే రన్స్‌తో పాటు ఫ్యామిలీ వాక్‌థాన్ నిర్వహించారు. చిన్నారులు, యువత, కుటుంబ సభ్యులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మారథాన్‌కు ముందు వార్మప్, జుంబా కార్యక్రమాలు నిర్వహించారు. 3కే రన్‌లో పాల్గొన్న వారు పీపుల్స్ ప్లాజా వైపు, 5కే రన్‌లో పాల్గొన్న వారు జలవిహార్ వైపు పరుగులు తీశారు.

1926లో స్థాపించబడిన గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహిబ్ శతాబ్దకాలంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా కొనసాగుతోంది. సేవ, విశ్వాసం, సమానత్వం, సోదరభావం, ఐక్య తను ప్రజల్లో చాటడమే శతాబ్ది వేడుకల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మారథాన్ అనంతరం పాల్గొన్న వారికి అల్పాహారం, రిఫ్రెష్‌మెంట్స్, ఎనర్జీ డ్రింక్స్, ప్రోటీన్ బార్లు అందించారు. వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచారు. వివిధ విభాగాల్లో విజేతలకు పతకాలు, బహుమతులు అందజేయడంతో పాటు పాల్గొన్న వారికి టీ-షర్టులు, కాంస్య పతకాలు, వాక్‌థాన్‌లో పాల్గొన్న వారికి డిజిటల్ సర్టిఫికెట్లు అందించారు.

సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు ఎస్. త్రిలోక్ సింగ్ మాట్లాడుతూ గురుద్వారాకు 100 ఏళ్లు పూర్తవడం చారిత్రక ఘట్టమని అన్నారు. ఘనమైన వారసత్వాన్ని స్మరించుకోవడంతో పాటు సేవ, విశ్వాసం, ఐక్యత స్ఫూర్తితో ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడమే వేడుకల ఉద్దేశమని తెలిపారు.



### సెప్టెంబర్‌లో కీలక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మారథాన్‌తో ప్రారంభమైన శతాబ్ది వేడుకలు ఏడాది పాటు కొనసాగనున్నాయి. సెప్టెంబర్‌లో అఖండ్ పాఠ్ సాహిబ్, కీర్తన్ దర్బార్, అమృత్ సంచార్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సిక్కు కుటుంబాలు, సందర్శకులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "ఒక కుటుంబం.. ఒక పంథ్.. ఒక సంగత్.. ఒక సమాజం.. ఒక చారిత్రక వేడుక" థీమ్‌తో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

## 25న సర్పంచుల చైతన్య సదస్సు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 23:**

25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యూ క్లబ్ ప్రాంగణంలో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశం సుభిక్షంగా ఉండాలంటే గ్రామాలు పచ్చదనంతో, స్వచ్ఛంగా, శక్తివంతంగా అభివృద్ధి చెందాలని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు గడుస్తున్నా స్థానిక సంస్థల పరిపాలన రోజురోజుకూ దిగజారిపోతుండటం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేయడానికి గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్న ఆయన, అందుకు అనుగుణంగా నిధులు, అధికారాలు కేటాయించాలని కోరారు.




గ్రామ పంచాయతీలలో చెక్కు పవర్ అధికారాలను సర్పంచ్ మరియు గ్రామ కార్యదర్శికే ఉంచాలని, 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం 243(G) ఆర్టికల్‌లోని 11వ షెడ్యూల్ ద్వారా 29 అధికారాలను పంచాయతీలకు వెంటనే బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకే ఇవ్వాలని, కేంద్ర నిధులతో పాటు రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయల్టీ టాక్స్ ఇతర రాబడుల రూపంలో రావాల్సిన బాకీలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. అలాగే సర్పంచులందరికీ నెలకు 30 వేల రూపాయల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును సర్పంచులంతా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగా వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యను ఖండించిన పీడీఎస్ యూ

**ముద్ర, ఖమ్మం:**

కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను పీడీఎస్ యూ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నిరసనగా ఖమ్మంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వంగూరి మాట్లాడుతూ మైనర్లు గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలుగా మారడం ఆందోళనకరమన్నారు. సోషల్ మీడియా, సినిమాల ప్రభావంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానవీయ విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.



మత్తు పదార్థాల సరఫరా ముఠా లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ నాయకులు వినయ్, సురేష్, మురళి, పృథ్వి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నాణ్యతపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు

**- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, తాండూర్:**

కాగ్నా నదిపై ఉన్న వంతెనకు నిర్మాణం పూర్తయిన ఏడాదిలోనే పగుళ్లు ఏర్పడటం పనుల నాణ్యతకు నిదర్శనమని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వంతెనను పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మరమ్మతులు చేపట్టి, నాణ్యతా ప్రమాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనుల నాణ్యతపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

తాండూర్ పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ, శుభకార్య క్రమా ల్లో ఎమ్మెల్యే బు య్యని మనోహర్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వినాయక కన్వెన్షన్, సల్లా గార్డెన్స్, జేవిఎస్ గార్డెన్స్, హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలతో పాటు వార్నాసి రఘు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.





### రేపు ఈద్ మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 25 మంగళవారం రాత్రి 8 గంటలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభ, 26న ఉదయం 9 గంటలకు మిలాద్ ఉన్ నబి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జలీల్ పుర మజీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు జలీల్ పుర మస్జీద్ ఆవరణలో మిలాద్ ఉన్ నబి బహిరంగ సభ కార్యక్రమంలో మత పెద్దల ధార్మిక ప్రసంగాలు ఉంటాయని, బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక జలీల్ పుర మజీద్ నుండి మిలాద్-ఉన్ నబి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ర్యాలీలో భువనగిరి పట్టణ ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

### ఆటో డ్రైవర్ల బంద్ కు సీపీఐ మద్దతు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం ఆగస్టు 23:** ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్ కు సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. పెరిగిన ఇంధన ధరలు, అధిక పన్నులు, ఇన్సూరెన్స్ భారంతో డ్రైవర్లు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్ ల వల్ల ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఆటోల బంద్ కు ప్రజలు కూడా సహకరించాలని సురేష్ కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 24.08.2026
www.mudranews.in | @mudranews



### సోయా ప్రోటీన్‌కు మంచి వనరు

సోయాలో అధిక మోతాదులో ప్రోటీన్ ఉంటుంది. శరీర కండరాల నిర్మాణం, మరమ్మతుకు ఇది ఉపయోగపడుతుంది.



# ఐక్య పోరాటాలతోనే జర్నలిస్టులకు రక్షణ

**భయంతో వచ్చే స్వీయ సెన్సార్ ప్రభుత్వ సెన్సార్ కంటే ప్రమాదకరం**
**జర్నలిస్టుల హక్కులకు బలమైన రక్షణ వ్యవస్థ ఏది?**
**ఖండనలతో కాదు.. కార్యాచరణతోనే రక్షణ**
**జర్నలిస్టులను విడదీస్తున్న కాంట్రాక్ట్ విధానం**
**-సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి**




**ముద్ర, హైదరాబాద్:** జర్నలిస్టులపై రాష్ట్రం, అధికార వ్యవస్థల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో కేవలం న్యాయస్థానాలు, రాజ్యాంగం, చట్టాలపైనే ఆధారపడటం సరిపోదని, జర్నలిస్టులు సమిష్టిగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ప్రజలను భాగస్వాములను చేసి ఎప్పటికప్పుడు ఉద్యమించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులు భయానికి గురై స్వీయ సెన్సార్ కు పాల్పడితే అది ప్రభుత్వ సెన్సార్ కంటే ప్రమాదకరంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన "జర్నలిస్టుల రక్షణ – రాజ్యం నుంచి వచ్చే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు సమిష్టి చర్యల అవసరం" అనే అంశంపై జరిగిన సెషన్ లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడారు.

జర్నలిస్టుల రక్షణకు సమిష్టితత్వం, సంప్రదింపులు ప్రజాస్వామ్య సంస్థల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. 'వాస్తవాలు పవిత్రమైనవేనని, అయితే వాటి ఆధారంగా జర్నలిస్టులు ఒక నిర్దిష్టమైన అభిప్రాయానికి రావడం సహజం. ఆ అభిప్రాయం ఎవరికైనా నచ్చకపోవచ్చు, దాంతో జర్నలిస్టులపై ఒత్తిడి, బెదిరింపులు మొదలవుతాయి' అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆ భయం జర్నలిస్టుల ఆలోచనల్లోకి చొరబడితే, వారు తదుపరి కథనం రాసేటప్పుడు ముందుగానే జాగ్రత్త పడే పరిస్థితి వస్తుందని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) భావప్రకటన స్వేచ్ఛకు హామీ ఇస్తోందని, భావప్రకటనతో పాటు ఆలోచన కూడా అత్యంత కీలకమని ఆయన అన్నారు. 1950లలోని ఆర్గనైజర్, క్రాస్ కేసుల నుంచి బెనెట్ కోల్మన్, ఎక్స్ గ్రూప్ కేసుల వరకు పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో న్యాయస్థానాలు కీలకపాత్ర పోషించాయని ఆయన గుర్తు చేశారు. జర్నలిజం ఒక మేధోపరమైన కార్యక్రమమా? లేక పారిశ్రామిక కార్యక్రకమంగా పరిగణించాలా? అనే అంశంపై గతంలో జరిగిన చర్చలను ఆయన ప్రస్తావించారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, సమిష్టి చర్చలు, ట్రేడ్ యూనియన్ల హక్కులు వంటి అంశాల నేపథ్యంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రూపుదిద్దుకున్న చరిత్రను వివరించారు. జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం రావాలంటే పౌర సమాజాన్ని ఏకం చేసి, చైతన్యపరచి, తమ ఉద్యమం వెనుక నిలబెట్టుకోవాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రాజ్యాంగ విలువలు, భావప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

#### జర్నలిస్టులకు రక్షణ ఏది? : శ్రీనివాస్ రెడ్డి

జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, దాడులు పెరుగుతున్న సమయంలో వారి వృత్తిపరమైన హక్కులకు, ఉద్యోగ భద్రతకు సమర్థవంతమైన రక్షణ వ్యవస్థ లేకపోవడం ఆందోళనకరమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులు తమ హక్కులు, మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు, వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా పోరాడాలన్నారు. జర్నలిజంలో క్షేత్రస్థాయి వార్తా సేకరణ తగ్గిపోవడం, డిజిటల్ మీడియా విస్తరణ, మీడియా సంస్థలపై పెరుగుతున్న ఒత్తిళ్లు, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, యూనియన్ల పాత్ర తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. తెలంగాణలో అనేక జర్నలిస్టు సంఘాలు, యూనియన్లు ఉన్నప్పటికీ జర్నలిస్టుల అసలు వృత్తిపరమైన సమస్యలపై అవి ఎంతవరకు పోరాడుతున్నాయనే ప్రశ్న తలెత్తుతోందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టు సంఘాలు కేవలం సమావేశాలు, ఉత్సవాలు, సన్మానాలకే పరిమితం కాకుండా నియామక పత్రాలు లేకుండా పనిచేస్తున్న జర్నలిస్టులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, తొలగింపులు, హక్కులు వంటి అంశాలపై సంఘాలు దృష్టి సారించాలని, జర్నలిస్టుల హక్కుల కోసం గొంతుకగా నిలవాలని ఉద్ఘాటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిన భావప్రకటన స్వేచ్ఛలో భాగంగా పత్రికా స్వేచ్ఛకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా పనిచేసే రక్షణ వ్యవస్థ ఏది అన్నది కీలక ప్రశ్నగా ఉందన్నారు. గతంలో అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టపరమైన రక్షణలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత వ్యవస్థలో జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించే బలమైన యంత్రాంగం అవసరమన్నారు.

#### జర్నలిస్టులను విడదీసే యత్నం: హర్తోష్ సింగ్ బల్

జర్నలిస్టులపై ప్రభుత్వాల నుంచి వచ్చే ప్రత్యక్ష ఒత్తిడి కంటే, వారిని వ్యక్తిగతంగా విడదీసి సమిష్టి శక్తిని బలహీనపరిచే కాంట్రాక్ట్ ఉద్యోగ విధానం, యాజమాన్యాల ఒత్తిళ్లు, ప్రభుత్వ ప్రకటనలపై మీడియా సంస్థలు ఆధారపడటం మరింత ప్రమాదకరంగా మారాయని ది కారవాన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హర్తోష్ సింగ్ బల్ అన్నారు. జర్నలిస్టుల రక్షణకు వ్యక్తిగత పోరాటాలు సరిపోవని, చట్టపరంగా, నైతికంగా, సంస్థాగతంగా అండగా నిలిచే సమిష్టి శక్తిని నిర్మించాలని స్పష్టం చేశారు. సరళీకరణ విధానాల తర్వాత, ముఖ్యంగా కాంట్రాక్ట్ జర్నలిజం పెరిగిన కాలంలో జర్నలిస్టులను వ్యక్తిగత స్థాయిలోకి పరిమితం చేసే వాతావరణం ఏర్పడిందని బల్ పేర్కొన్నారు. ఒక జర్నలిస్ట్ తన జీతం, ఉద్యోగ పరిస్థితుల గురించి మరో జర్నలిస్ట్ మాట్లాడని పరిస్థితి ఏర్పడిందన్నారు. తన రాజకీయ అభిప్రాయాలు యాజమాన్యానికి అసౌకర్యంగా ఉన్నాయనే కారణంతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని, ఆ తర్వాత లేబర్ కోర్టులో ఐదేళ్లకు పైగా న్యాయపోరాటం చేసి విజయం సాధించానని ఆయన చెప్పారు.

#### ఖండనలతో సరిపోదు: సంగీత బారువా

'జర్నలిస్టుపై దాడి జరిగితే ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేయడం, ప్రెస్ మీట్ పెట్టడం మాత్రమే సరిపోతుందా? అని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీత బరుహ పిషారోటి ప్రశ్నించారు. జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, దాడులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సమిష్టి పోరాటాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ప్రెస్ క్లబ్ జర్నలిస్టు సంఘాలు కలిసి కార్యాచరణ రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జర్నలిస్టులపై దాడి జరిగిన ప్రతిసారీ వాస్తవాలను నిర్ధారించి ప్రతికా ప్రకటన విడుదల చేయడం సాధారణంగా మారిందని, అయితే అలాంటి ప్రకటనలతోనే జర్నలిస్టులకు వాస్తవ రక్షణ లభిస్తుందా? అన్నది ఇప్పుడు ఆలోచించాల్సిన ప్రశ్న అన్నారు.

## వర్షాలు పడటం లేదంటూ మృతదేహాన్ని వెలికితీసి మళ్లీ దహనం



**ముద్ర, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లాలో వింత ఘటన వెలుగుచూసింది. వర్షాలు పడటం లేదంటూ పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పెట్రోల్ పోసి దహనం చేశారు. పదర మండలం కోడోనిపల్లిలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూడు నెలల క్రితం మృతిచెందారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఖననం చేశారు. గ్రామంలో వర్షాలు పడటం లేదనే మూఢ నమ్మకంతో ఆయన మృతదేహాన్ని జేసీబీ సాయంతో గ్రామస్థులు వెలికి తీశారు. అనంతరం కట్టెలు పేర్చి పెట్రోల్ పోసి దహనం చేశారు.

## శంషాబాద్‌లో మద్యం మత్తులో హల్‌చల్..

**ప్రయాణికుడిని వదిలేసి వెళ్లిన విమానం**

**ముద్ర, శంషాబాద్:** మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేసిన ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. విమానాశ్రయం అధికారుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి విమానంలో వారణాసి వెళ్లేందుకు టికెట్ తీసుకున్నాడు. తీవ్రమైన మద్యం మత్తులో విమానాశ్రయానికి చేరుకున్నాడు. అతి కష్టం మీద బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేసుకుని విమానం ఎక్కుతున్న క్రమంలో తూలుతుండడమే కాకుండా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు ఆ ప్రయాణికుడిని వదిలేసి వెళ్లిపోయారు.

## అమెరికాకు కెనడా షాక్.. సరికొత్త ట్రేడ్ వార్!

**ముద్ర డెస్క్ :** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక పొరుగు దేశం కెనడాలో కయ్యం పెట్టుకుంటున్నారు. అక్రమ వలసలు ఆపకపోతే కెనడాని అమెరికా 51వ రాష్ట్రంగా ప్రకటిస్తామని ట్రంప్ ప్రకటించారు. దీనిపై కెనడా మండిపడింది. ఇదే సమయంలో కెనడాలోని కొన్ని ప్రాంతాలు అమెరికాలో కలపాలని నిరసనలు తెలిపాయి. దీని వెనుక అమెరికా ఉందన్న ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రశాంతంగా ఉండె కెనడాలో ట్రంప్ వాణిజ్య చిచ్చు పెట్టారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి అంగీకరించలేదనే కారణంతో ట్రంప తాజాగా ఆ దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. అయితే అమెరికా టారిఫ్‌లకు కెనడా ఎక్కడా జంకలేదు. తగ్గేదే లే అన్నట్లుగా అగ్రరాజ్యం దిగుమతులపై కెనడా అంతే స్థాయిలో టారిఫ్‌లు విధించి షాక్ ఇచ్చింది. ప్రధాని మార్క్ కార్నీ నాయకత్వంలో ఒట్టావా ప్రభుత్వం అమెరికాపై 50 శాతం ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు ప్రకటించింది. ఉక్కు, పాల ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలపై సెప్టెంబర్ 8 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. గత కొన్ని వారాలుగా అమెరికా–కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం తీవ్రమైన చర్చలు జరిగాయి. ట్రంప్ ప్రభుత్వం చివరి నిమిషంలో కొత్త నిబంధనలు ప్రతిపాదించింది. అవి అన్యాయమైనవిగా, ఆర్థికంగా ప్రయోజనం లేనివిగా కెనడా భావించింది. ప్రత్యేకంగా కెనడా ఇతర దేశాలతో కొత్త వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంపై పరిమితులు, సార్వభౌమత్వం సంబంధిత అంశాలు సమస్యగా మారాయి. 'వారు ఎక్కువ అడిగారు, తక్కువ ఇచ్చారు. మేము అంగీకరించం' అని కార్నీ వాణిజ్య ఒప్పందంపై స్పష్టం చేశారు. ఫలితంగా చర్చలు నిలిచిపోయాయి. అమెరికా టారిఫ్‌లు అమల్లోకి వచ్చాయి.

**కెనడా ప్రతీకారం..**

ట్రంప్ విధించిన సుంకాలకు ప్రతీకారంగా కెనడా 'డాలర్ టు డాలర్' సూత్రంపై సమాధానం ఇవ్వనున్నది. అమెరికా విధించిన సుంకాలకు సమానంగా తన సుంకాలు ఉంటాయని ప్రకటించింది. ఉక్కు, పాల ఉత్పత్తులు, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, పల్ప్ అండ్ పేపర్, ఎలక్ట్రానిక్స్ దిగుమతులపై ఈ టారిఫ్ వర్తిస్తుదని ప్రకటించింది. కెనడా ప్రధాని 'మేము దాడికి గురయ్యాము. యుద్ధంలో ఉన్నప్పుడు స్పందించాల్సిందే.' అయితే ఇది అయిష్టంగానే చేస్తున్నామని, కెనడా కుటుంబాలు, వ్యాపారాలపై ధరలు పెరిగే అవకాశం ఉందని కూడా అంగీకరించారు.

# మెరుగైన జర్నలిజంతోనే ప్రజా విశ్వాసం

#### మీడియా కాన్ క్లేవ్ లో ప్రముఖ జర్నలిస్టుల అభిప్రాయం




**ముద్ర న్యూస్ బ్యూరో హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో మీడియా విశ్వసనీయతను కాపాడుకోవడం నేడు అత్యంత కీలక సవాల్ గా మారిందని, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే నిష్పాక్షికత, వాస్తవ నిర్ధారణ, పారదర్శకత, మెరుగైన జర్నలిజం మాత్రమే శాశ్వత మార్గమని ప్రముఖ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆదివారం నిర్వహించిన 'మీడియా కాన్ క్లేవ్-2026 రెండో రోజు తొలి సెషన్ 'మీడియాలో విశ్వాస సంక్షోభం – భారతీయ మీడియా ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందగలదా?' అనే అంశంపై నిర్వహించిన చర్చలో సీనియర్ జర్నలిస్టులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు ఉమా సుధీర్ మోడరేటర్ గా వ్యవహరించగా, ది హిందూ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్, ఆల్ట్ న్యూస్ వ్యవస్థాపకుడు ప్రతీక్ సిన్హా, ది సియాసత్ డైలీ డిజిటల్ ఎడిటర్ సైదా ఫైజా పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఉమా సుధీర్ మాట్లాడుతూ రాయిటర్స్ ఇనిస్టిట్యూట్ అధ్యయనాల ప్రకారం ప్రింట్ మీడియాపై ఇప్పటికీ 60-65 శాతం వరకు ప్రజల విశ్వాసం కొనసాగుతుండగా, టెలివిజన్ మీడియాపై అది 30 శాతం వరకు పడిపోయిందన్నారు. దీనిపై స్పందించిన ఎన్.రామ్ భారతదేశం విస్తారమైన దేశం కావడంతో పరిమిత సర్వేల ఆధారంగా తుది నిర్ణయాలకు రావడం సమంజసం కాదన్నారు. అయినప్పటికీ మీడియాపై విశ్వాసం క్రమంగా తగ్గుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. రాయిటర్స్ నివేదికల ప్రకారం కేవలం 39 శాతం మంది భారతీయులే మీడియాను విశ్వసిస్తున్నారని గుర్తు చేస్తూ, ఈ పరిస్థితికి ప్రధాన కారణం జర్నలిజం విలువల క్షీణత కంటే మీడియా ఆర్థిక నమూనా బలహీనపడటమేనని విశ్లేషించారు. ఒకప్పుడు ప్రకటనల ఆదాయం నాణ్యమైన జర్నలిజానికి అండగా నిలిచేదని, ప్రస్తుతం ఆ ఆదాయ వనరులు తగ్గిపోవడంతో మీడియా సంస్థలు వ్యయాలను కుదించుకోవాల్సి వస్తోందని, దాని ప్రభావం క్షేత్రస్థాయి రిపోర్టింగ్, పరిశోధనాత్మక కథనాలపై పడుతోందని తెలిపారు.

#### పారదర్శకతతోనే విశ్వాస పునరుద్ధరణ : ఎన్. రామ్

ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే మీడియా సంస్థలు స్పష్టమైన సంపాదకీయ విధానాలు అమలు చేయాలని ఎన్. రామ్ సూచించారు. నైతిక నియమావళి, తప్పులను వెంటనే సరిదిద్దే వ్యవస్థ, రీడర్స్ ఎడిటర్ లేదా న్యూస్ ఓంబుడ్స్ మన్ వంటి వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరారు. యుకెలో అమలులో ఉన్న స్వీయ నియంత్రణ నమూనాలను పరిశీలించాలని, మీడియా అక్షరాస్యతను పాఠశాల స్థాయి నుంచే పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భవిష్యత్ తరాలు తప్పుడు సమాచారాన్ని గుర్తించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.

రవీష్ కుమార్, ధ్రువ్ రాఠీ వంటి స్వతంత్ర జర్నలిస్టులు, యూట్యూబ్ ఆధారిత కంటెంట్ సృష్టికర్తలు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులను ఆకర్షిస్తున్నప్పటికీ, వారు సంస్థాగత జర్నలిజానికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాలేరని ఎన్. రామ్ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత స్థాయిలో ఇలాంటి నమూనాలు దీర్ఘకాలికంగా కొనసాగడం కష్టమని వ్యాఖ్యానించారు. కోవిడ్ 19 మహమ్మారి సమయంలో ప్రజలు నమ్మదగిన వార్తల కోసం సంప్రదాయ మీడియాపైనే ఎక్కువగా ఆధారపడ్డారని ఎన్. రామ్ గుర్తుచేశారు. తప్పుడు వైద్య సమాచారాన్ని నియంత్రించడంలో భారతీయ మీడియా కొంత మేర బాధ్యతాయుతంగా వ్యవహరించిందని, దీంతో విశ్వసనీయతకు కొంత ఊతం లభించిందన్నారు.

#### డిజిటల్ యుగంలో మారిపోయిన వార్తల ప్రపంచం : ప్రతీక్ సిన్హా

ఆల్ట్ న్యూస్ వ్యవస్థాపకుడు ప్రతీక్ సిన్హా మాట్లాడుతూ సోషల్ మీడియా ఆవిర్భావంతో వార్తల సృష్టి, ప్రసారం, వినియోగ విధానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. గతంలో వార్తలను కేవలం మీడియా సంస్థలే ప్రజలకు చేరవేసేవని, ఇప్పుడు ప్రతి స్మార్ట్ వినియోగదారుడే సమాచార సృష్టికర్తగా, ప్రసారకర్తగా మారాడన్నారు. యువత సంప్రదాయ మీడియాపై మాత్రమే ఆధారపడకుండా వివిధ వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి స్వయంగా నిజానిజాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. అయితే 'లైక్– కామెంట్ – షేర్' ఆధారిత సోషల్ మీడియా వ్యవస్థలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించే ప్రమాదం అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జర్నలిజంలో పొరపాటున వ్యాప్తి చెందే తప్పుడు సమాచారానికి, ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేసే అసత్య ప్రచారానికి మధ్య స్పష్టమైన తేడా గుర్తించాలని ప్రతీక్ సిన్హా సూచించారు. ప్రధాన మీడియా సంస్థలు సైతం ధృవీకరణ లేకుండా ప్రసారం చేసే వార్తలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. తమ ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థ అనేక తప్పుడు కథనాలను వెలుగులోకి తీసుకువచ్చిందని, కొన్ని సందర్భాల్లో తప్పుడు ప్రచారం కారణంగా అమాయకులు నష్టపోయిన ఉదాహరణలు ఉన్నాయని వివరించారు.

#### పాఠకులే స్వతంత్ర మీడియాకు బలం

స్వతంత్ర మీడియా సంస్థలు ప్రజల సహకారంతో కూడా విజయవంతంగా కొనసాగగలవని ప్రతీక్ సిన్హా తెలిపారు. భారీ విరాళాల కంటే వేలాది మంది పాఠకులు చిన్న మొత్తాల్లో అందించే సహకారమే స్థిరమైన ఆర్థిక నమూనాకు పునాది అవుతుందని చెప్పారు. ఆల్ట్ న్యూస్ కూడా ప్రధానంగా ప్రజల విరాళాల ఆధారంగానే కొనసాగుతోందని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తే పాఠకులే మీడియాను నిలబెడతారని ఆయన అన్నారు.

భవిష్యత్తులో మీడియా సంస్థలు సోషల్ మీడియా దిగ్గజాలపై పూర్తిగా ఆధారపడకుండా తమ సొంత డిజిటల్ వేదికలను అభివృద్ధి చేసుకోవాలని ప్రతీక్ సిన్హా సూచించారు. సెన్సార్ షిప్ ఎదుర్కొనే సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటికే అందుబాటులో ఉందని, జర్నలిస్టులు కూడా డిజిటల్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

#### ప్రాంతీయ మీడియాకు ప్రజలతో మరింత అనుబంధం : సైదా ఫైజా

సియాసత్ డైలీ డిజిటల్ ఎడిటర్ సైదా ఫైజా మాట్లాడుతూ ప్రాంతీయ మీడియా పరిమిత వనరులతో పనిచేస్తున్నప్పటికీ ప్రజలకు మరింత చేరువగా ఉంటుందన్నారు. ప్రజలకు నేరుగా జవాబుదారుగా ఉండాల్సిన పరిస్థితి ప్రాంతీయ మీడియాపై ఎక్కువగా ఉంటుందని చెప్పారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా వీడియో ఆధారిత కథనాలు, కొత్త ఫార్మాట్ అనుసరిస్తూ యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. విశ్వసనీయతే ప్రాంతీయ మీడియాకు అతిపెద్ద బలమని ఆమె అభిప్రాయపడ్డారు.

ప్రెస్ క్లబ్ ఐక్యత అవసరం

దేశవ్యాప్తంగా ప్రెస్ క్లబ్ ఐక్యంగా పనిచేస్తే జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు నాణ్యమైన జర్నలిజాన్ని బలోపేతం చేయవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత మీడియాపై ఉందని, అందుకు మీడియా సంస్థలు, జర్నలిస్టులు, పాఠకులు కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సదస్సులో వ్యక్తమైన ప్రధాన సూచనలను 'హైదరాబాద్ డిక్లరేషన్'లో చేర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల జర్నలిస్టులు, మీడియా విద్యార్థులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad 500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNL Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555